జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 90॥ మంగళవారం ॥ 25-8-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



25 ఆగస్టు 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:04 సూర్యాస్తమయం - సా. 6:31 తిథి ద్వాదశి ఉ. 6:21 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం ఉత్తరాషాఢ రా. 10:40 వరకు తరువాత శ్రవణ యోగం ఆయుష్మాన్ ఉ. 7:39 వరకు కరణం భాలవ ఉ. 6:21 వరకు కౌలవ రా. 7:10 వరకు వర్జ్యం తె. 5:16 నుండి ఉ. 7:02 వరకు దుర్ముహూర్తం ఉ. 8:34 నుండి ఉ. 9:24 వరకు రా. 11:09 నుండి రా. 11:55 వరకు రాహుకాలం మ. 3:24 నుండి సా. 4:58 వరకు యమగండం ఉ. 9:11 నుండి ఉ. 10:44 వరకు గుళికాకాలం మ. 12:18 నుండి మ. 1:51 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:28 నుండి తె. 5:16 వరకు అమృత ఘడియలు మ. 3:48 నుండి సా. 5:33 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:43 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున



# విజయగాథగా ముసునూరు

### అభివృద్ధి, జాతీయవాదం సమతుల్యం చేసిన నాయకత్వం

### రైతులే దేశానికి వెన్నెముక: ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్

### పాప్‌కార్న్ విత్తన ఆవిష్కరణలో ప్రశంసలు

### వ్యవసాయ రంగ ప్రాధాన్యంపై ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వాన్ని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రశంసించారు. చంద్రబాబు ఒక నిజమైన జాతీయవాది అని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిచ్చే నాయకుడని పేర్కొన్నారు. జాతీయవాద భావన రాష్ట్ర ప్రగతికి అడ్డంకిగా మారకుండా సమతుల్యం చేయగల సామర్థ్యం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. ఏలూరు జిల్లా ముసునూరులో నిర్వహించిన నాన్-జీఎంఓ హై ఎక్స్‌పాన్షన్ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తన ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపరాష్ట్రపతి ఈ వ్యాఖ్యలు చేశారు.

ఏలూరు, ఆగస్టు 24: ముసునూరు గ్రామాన్ని వ్యవసాయ రంగంలో ఆదర్శంగా తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణాభివృద్ధి, రైతుల సంక్షేమం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ప్రోత్సాహంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ముసునూరు విజయగాథ దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైం దని ఉపరాష్ట్రపతి తెలిపారు. రెండు నెలల క్రితం ఒక (మిగతా 2వ పేజీలో)






# విదేశీ విద్యార్థులకు హార్వర్డ్ హెచ్చరిక

### సెప్టెంబర్ 15లోపు అమెరికాకు చేరాలని సూచన

### వీసా నిబంధనల్లో కీలక మార్పులకు రంగం

వాషింగ్టన్, ఆగస్టు 24 (రుద్రన్యూస్) : అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న అంతర్జాతీయ విద్యార్థులకు ప్రముఖ హార్వర్డ్ విశ్వవిద్యాలయం కీలక హెచ్చరిక జారీ చేసింది. అమెరికా జాతీయ భద్రతా శాఖ ఎఫ్-1, జే-1 వీసా నిబంధనల్లో తీసుకురానున్న మార్పుల నేపథ్యంలో విదేశీ ప్రయాణాల్లో (మిగతా 2వ పేజీలో)




# హక్కులను కాలరాస్తున్న కేంద్రం

### అమెరికా పర్యటన తిరస్కరణపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

### తెలంగాణపై వివక్ష చూపుతున్నారని ఆరోపణ.. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్న వ్యాఖ్యలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిన అంశం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై సోమవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ముఖ్యమంత్రి, తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షతో వ్యవహరిస్తోందని ఆరోపించారు.

- హైదరాబాద్, ఆగస్టు 24 (రుద్రన్యూస్) :

రాష్ట్ర అభివృద్ధి, విద్య, క్రీడలు, పెట్టుబడుల సాధన లక్ష్యంగా విదేశీ పర్యటన కార్యాచరణ రూపొందించుకున్నామని, ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను విదేశాంగ మంత్రిత్వ శాఖకు ముందుగానే సమర్పించామని తెలిపారు. అయితే ఇంగ్లాండ్ పర్యటనకు అనుమతి ఇచ్చి, అమెరికా పర్యటనను తిరస్కరించడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రాల కలయికనే కేంద్ర ప్రభుత్వం అనే (మిగతా 2వ పేజీలో)



# పవర్ ఎగ్జిబిషన్-2026కు శ్రీకారం

### ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం

### విద్యుత్ రంగ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

### ఆధునిక సాంకేతిక సేవలకు ప్రాధాన్యం

### శక్తివంతమైన తెలంగాణ నిర్మాణమే ధ్యేయం

హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'పవర్ ఎగ్జిబిషన్--2026'ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. విద్యుత్ రంగంలో తెలంగాణ సాధించిన పురోగతిని ప్రజలకు పరిచయం చేయడం, భవిష్యత్ ప్రణాళికలను ప్రదర్శించడం ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో విద్యుత్ రంగాన్ని మరింత పటిష్టం చేస్తున్నామని చెప్పారు. పారిశ్రామిక, వ్యవసాయ, గృహ అవసరాలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. 2




### రైస్ మిల్లర్లపై అక్రమ కేసులు...

# కక్షసాధింపు చర్యలు సరికావు

### వజ్ర రైస్ మిల్ ఇండస్ట్రీస్ అధినేత వట్టె జానయ్య యాదవ్

రాష్ట్రంలోని రైస్ మిల్లర్లను ఉద్దేశపూర్వకంగా దొంగలుగా చిత్రీకరించడం, అక్రమ కేసులు పెట్టడం, కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని వజ్ర రైస్ మిల్ ఇండస్ట్రీస్ అధినేత, బీసీ నాయకుడు, సూర్యాపేట కంటెస్టెడ్ మీూా వట్టె జానయ్య యాదవ్ అన్నారు. రైస్ మిల్లర్లపై వస్తున్న ఆరోపణలు, తనపై జరుగుతున్న రూ.72 కోట్ల స్కామ్ ప్రచారంపై ఆయన 'బిఆర్కే న్యూస్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో స్పందించారు.

సూర్యాపేట,( మనదీపం) ఆగస్ట్ 24 : రాష్ట్రంలో ఉన్న మూడు వేలకుపైగా రైస్ మిల్లులు ప్రభుత్వాన్ని మోసం చేయడానికి ఏర్పాటు చేసినవి కావని, రైతులకు అండగా నిలుస్తూ మిల్లింగ్ రంగాన్ని కొనసాగిస్తున్నామని జానయ్య యాదవ్ పేర్కొన్నారు. తనపై రూ.72 కోట్లు, మరికొందరు మిల్లర్లపై రూ.69 కోట్లు, (మిగతా 2వ పేజీలో)



# క్రమశిక్షణకు అందరూ కట్టుబడాలి

### కొండా సురేఖ నోటీసులపై సీఎం స్పందన

### పార్టీ వ్యవహారాలపై వ్యాఖ్యానించనన్న సీఎం

### నిర్ణయం క్రమశిక్షణా సంఘానిదే

హైదరాబాద్, ఆగస్టు 24 (రుద్రన్యూస్) : రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా సంఘం షోకాజ్ నోటీసు జారీ చేసిన వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరూ పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. పార్టీ నిబంధనలు అందరికీ సమానంగా వర్తిస్తాయని పేర్కొన్నారు. క్రమశిక్షణ విషయంలో ఎవరూ మినహాయింపు కాదనే సందేశాన్ని ఆయన (మిగతా 2వ పేజీలో)



# విదేశీ పర్యటనపై సీఎంకు శుభాకాంక్షలు

### లండన్ పర్యటన విజయంపై అభినందనలు

### సచివాలయంలో ప్రజాప్రతినిధుల సమావేశం

### పెట్టుబడుల ఆకర్షణపై చర్చ

### రాష్ట్రాభివృద్ధికి మద్దతు ప్రకటించిన నేతలు

హైదరాబాద్, ఆగస్టు 24 : విదేశీ పర్యటనను విజయవంతంగా ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలియజేశారు. ఇటీవల నిర్వహించిన విదేశీ పర్యటనలో రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడం, విద్య, క్రీడలు, పారిశ్రామిక రంగాల్లో సహకార అవకాశాలను అన్వేషించడం లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపట్టినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ పర్యటన 2

# నేటి రాశి ఫలాలు

**మేషం:** ఆరోగ్య విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. వ్యాపార విషయంలో కుటుంబ పెద్దల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. ఉద్యోగస్తులకు పనిభారం పెరుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు మందకోడిగా సాగుతాయి. ఆర్ధిక పరిస్థితి మందగిస్తుంది. ఇంటాబయట మానసిక సమస్యలు చికాకు పరుస్తాయి.

**వృషభం:** నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. పాత ఋణాలు తీర్చగలరు. వ్యాపార విస్తరణకు పెట్టుబడులు అందుతాయి. దూరపు బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**మిధునం:** వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. మిత్రులతో చిన్నపాటి మాటపట్టింపులు కలుగుతాయి. అనుకున్న పనులు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. ఉద్యోగాలలో శ్రమకు తగిన గుర్తింపు లభించదు. ఇంటాబయట నూతన సమస్యలు తప్పవు. మానసిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

**కర్కాటకం:** వృత్తి వ్యాపారాల్లో ఆశించిన పురోగతి లభిస్తుంది. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాల్లో మీ హోదా పెరుగుతుంది. విద్యార్థుల నూతన విద్యావకాశములు లభిస్తాయి. సన్నిహితుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి.

**సింహం:** ఉద్యోగస్తులకు పని ఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుంది. బంధు మిత్రుల సహాయ సహకారాలతో కొన్ని వ్యవహారాలు పూర్తి చేస్తారు. ఆర్థిక వాతావరణం ఆశించిన విధంగా ఉంటుంది. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. కుటుంబ సభ్యులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**కన్య:** వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు తప్పవు. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త వహించాలి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆదాయానికి మించిన ఖర్చులు పెరుగుతాయి. బంధు మిత్రులతో ఊహించని కలహాలు కలుగుతాయి.

**తుల:** నిరుద్యోగులకు ప్రయత్నాలు ఫలించవు. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలలో నిలకడ లోపిస్తుంది. వృత్తి వ్యాపారాలలో అకారణ వివాదాలు కలుగుతాయి.

**వృశ్చికం:** సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్ర దర్శనం చేసుకుంటారు. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు.

**ధనస్సు:** వృత్తి వ్యాపారాల్లో ఆశించిన లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు అధికారులు అనుగ్రహంతో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. గృహ నిర్మాణ ఆలోచనలు ఆచరణలో పెడతారు. శుభకార్యాలకు హాజరవుతారు. ఇంటా బయట మానసిక ప్రశాంతత కలుగుతుంది. చేపట్టిన వ్యవహారాలు విజయవంతంగా పూర్తి చేస్తారు.

**మకరం:** వ్యాపార ఉద్యోగాలు కొంత నిదానంగా సాగుతాయి. బంధు వర్గంతో విభేదాలు కలుగుతాయి. అనుకున్న సమయానికి డబ్బు చేతికి అందక ఇబ్బంది పడతారు. దైవ చింతన పెరుగుతుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటారు. దూర ప్రయాణాలలో జాగ్రత్తగా వ్యవహరించాలి.

**కుంభం:** వ్యాపారాలలో తీసుకున్న నిర్ణయాలు కలిసిరావు. వృత్తి ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. చేపట్టిన పనుల్లో ఆటంకాలు తప్పవు. మిత్రులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. నూతన ఋణ ప్రయత్నాలు కలసిరావు. ఖర్చుల విషయంలో ఆలోచించి వ్యవహరించడం మంచిది. ఆకస్మిక ప్రయాణాలు చేస్తారు.

**మీనం:** వృత్తి వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. సమాజంలో పేరు కలిగిన వ్యక్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. ఉద్యోగమున నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. చేపట్టిన పనులు వేగవంతంగా పూర్తి చేస్తారు. పాతమిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు.



# ..కక్షసాధింపు చర్యలు సరికావు

(మొదటి పేజీ తరువాయి)

రూ.63 కోట్ల మేర అక్రమాలకు పాల్పడ్డారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆయన ఖండించారు.

### సీఎంఆర్ నిబంధనలే ప్రధాన సమస్య

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)లో అమలవుతున్న కొన్ని నిబంధనలు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా లేవని జానయ్య యాదవ్ అన్నారు. క్వింటా ధాన్యానికి 67 కిలోల బియ్యం ఇవ్వాలనే నిబంధన చాలా కాలం క్రితం రూపొందించిందని, వాస్తవ మిల్లింగ్ ప్రక్రియలో నూకలు, తవుడు, రిజెక్షన్ తదితర కారణాలతో బియ్యం దిగుబడి తగ్గుతుందని వివరించారు.

ఈ షార్ట్‌ఫాల్ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని, గతంలో మంత్రులుగా పనిచేసిన నాయకులు సైతం ఈ అంశంపై అధికారులకు లేఖలు రాసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. నిబంధనల్లోని లోపాలను సరిచేయకుండా మొత్తం లోటును మిల్లర్లపై మోపడం వల్లే వివాదాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.

### టెస్ట్ మిల్లింగ్‌కు సిద్ధం

అధికారులు మిల్లుల్లో ధాన్యం లేదంటూ లెక్కలు వేసి మిల్లర్లను నేరస్థులుగా చిత్రీకరిస్తున్నారని జానయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం లేదా సివిల్ సప్లై అధికారులు గోదాముల్లో ఉన్న ధాన్యంతో టెస్ట్ మిల్లింగ్ నిర్వహించి, వాస్తవంగా ఎంత బియ్యం దిగుబడి వస్తుందో ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆయన సవాల్ చేశారు.

ప్రభుత్వానికి న్యాయబద్ధంగా ఎంత బాకీ ఉన్నా చెల్లించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, అయితే వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా తమపై నేరారోపణలు చేయడం సరికాదని అన్నారు.

### రైతులకు అండగా నిలిచింది మిల్లర్లే

వర్షాకాలంలో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకునేందుకు మిల్లర్లు తమ సామర్థ్యానికి మించి పనిచేశారని జానయ్య యాదవ్ తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి మంత్రులు, ఎమ్మెల్యేలు ముందుకు రాని పరిస్థితుల్లో మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం తీసుకుని వారికి అండగా నిలిచారని పేర్కొన్నారు.

తాము ప్రతి నెల లక్షల రూపాయల విద్యుత్ బిల్లులు, జీఎస్టీ తదితర పన్నులు చెల్లిస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నామని చెప్పారు. అయినప్పటికీ రాజకీయ కక్షసాధింపులో భాగంగా మిల్లర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తన కుటుంబ సభ్యులు, ఎంబీబీఎస్ చదువుతున్న తన కుమారుడిని కూడా జైలుపాలు చేయడం తీవ్రంగా బాధించిందని అన్నారు.

### మిల్లర్లతో ప్రభుత్వం చర్చలు జరపాలి

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, సివిల్ సప్లై అధికారులు రైస్ మిల్లర్లను పిలిచి సమస్యలపై సమగ్రంగా చర్చించాలని జానయ్య యాదవ్ డిమాండ్ చేశారు. సీఎంఆర్ నిబంధనలు, షార్ట్‌ఫాల్ సమస్య, మిల్లర్లపై నమోదవుతున్న కేసులపై వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కోరారు.రైస్ మిల్లర్ల సమస్యను కేవలం మిల్లర్ల సమస్యగా చూడవద్దని, భవిష్యత్తులో ఇదే పరిస్థితి కొనసాగితే దాని ప్రభావం రైతాంగంపైనా పడే అవకాశం ఉందని ఆయన



హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మిల్లర్లతో చర్చలు జరిపి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వట్టె జానయ్య యాదవ్ కోరారు.

# విద్యార్థులకు హార్వర్డ్ హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న విద్యార్థులు, పరిశోధకులు సెప్టెంబర్ 15లోపు తిరిగి అమెరికాకు చేరుకోవాలని సూచించింది. కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చిన తర్వాత తిరిగి ప్రవేశించే వారికి తాజా నియమాలు వర్తించే అవకాశం ఉండటంతో ఈ సూచనలు చేసినట్లు విశ్వవిద్యాలయం వెల్లడించింది. ప్రస్తుతం అంతర్జాతీయ విద్యార్థులు తమ విద్యా కార్యక్రమం పూర్తయ్యే వరకు అమెరికాలో ఉండేందుకు అనుమతించే "డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్" విధానం అమల్లో ఉంది. ఈ విధానం కారణంగా కోర్సు పూర్తయ్యే వరకు ప్రత్యేక కాలపరిమితి లేకుండా విద్యార్థులు దేశంలో ఉండగలుగుతున్నారు. అయితే కొత్త మార్గదర్శకాల ప్రకారం ఈ విధానాన్ని రద్దు చేసి, నిర్దిష్ట కాలపరిమితితో కూడిన కొత్త వ్యవస్థను అమలు చేయాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త విధానంలో విద్యార్థులకు గరిష్ఠంగా నాలుగేళ్ల వరకు మాత్రమే అనుమతి ఇవ్వడం లేదా వారు అభ్యసిస్తున్న కోర్సు వ్యవధికి అనుగుణంగా ముందుగానే ముగింపు తేదీని నిర్ణయించడం జరుగుతుంది. దీంతో దీర్ఘకాలిక పరిశోధన కార్యక్రమాలు, డాక్టరేట్ కోర్సులు లేదా ప్రత్యేక విద్యా ప్రణాళికల్లో ఉన్న విద్యార్థులపై ప్రభావం పడే అవకాశం ఉందని విద్యా వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా అనుకోని కారణాలతో కోర్సు ఆలస్యం అయితే అదనపు అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే అమెరికాలో ఉండి విద్యను కొనసాగిస్తున్న విద్యార్థులకు కొంత వరకు మినహాయింపులు లభించే అవకాశమున్నప్పటికీ, సెప్టెంబర్ 15 తర్వాత విదేశాలకు వెళ్లి తిరిగి ప్రవేశించే వారిపై కొత్త నిబంధనలు పూర్తిగా అమలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రయాణ ప్రణాళికలు రూపొందించుకునే విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హార్వర్డ్ యాజమాన్యం సూచించింది. ముఖ్యంగా సెలవులు, పరిశోధన కార్యక్రమాలు లేదా కుటుంబ కారణాలతో విదేశాల్లో ఉన్నవారు నిర్ణీత తేదీలోపు తిరిగి చేరుకోవాలని స్పష్టం చేసింది. నాలుగేళ్లకు మించి అమెరికాలో ఉండాల్సిన అవసరం ఉన్న విద్యార్థులు ప్రత్యేకంగా పొడిగింపు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ ద్వారా అనుమతి పొందాల్సి ఉంటుంది.

# తెలంగాణ హక్కులను కాలరాస్తున్న కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్య స్ఫూర్తిని గుర్తుంచుకోవాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యాలను ప్రపంచానికి పరిచయం చేయడం, విద్యా సంస్థలు, క్రీడా రంగం, పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించడం కోసం అమెరికా పర్యటనను ప్రణాళికబద్ధంగా రూపొందించామని వివరించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు అన్ని వివరాలు అందించినప్పటికీ అనుమతి నిరాకరించారని, ఇందుకు గల రాజకీయ కారణాలను ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాజకీయ నిర్ణయాలతో తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించిన ముఖ్యమంత్రి, అదే సమయంలో గుజరాత్ ముఖ్యమంత్రికి ఆగస్టు 17 నుంచి 28 వరకు అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతి ఇవ్వడాన్ని ప్రస్తావించారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో పెట్టుబడుల కోసం విదేశీ పర్యటనలకు అనుమతి ఉంటే, తెలంగాణ రైజింగ్--2047 కోసం చేపట్టిన పర్యటనను ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. తన పర్యటనలో ఏవైనా అభ్యంతరకర అంశాలు ఉన్నట్లయితే ఇంగ్లాండ్ పర్యటనకు కూడా అనుమతి ఇవ్వకూడదని, ఒక దేశానికి అనుమతి ఇచ్చి మరో దేశానికి తిరస్కరించడం వివక్షకు నిదర్శనమని అన్నారు. విద్య, క్రీడల అభివృద్ధికి అంతర్జాతీయ భాగస్వామ్యాలు అవసరమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి మహనీయులు విదేశాల్లో విద్యాభ్యాసం చేసి దేశానికి దిశానిర్దేశం చేశారని గుర్తు చేశారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రపంచ స్థాయి విద్య, అవకాశాలు అందుబాటులోకి రావాలంటే విదేశీ సంస్థలతో భాగస్వామ్యాలు అవసరమని, అందుకే విదేశీ పర్యటనలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ పర్యటనలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, రాష్ట్ర భవిష్యత్తు కోసం చేపట్టిన కార్యక్రమాలని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికీ గుజరాత్ నాయకుడిగానే వ్యవహరిస్తున్నారని, భారత ప్రధానిగా అన్ని రాష్ట్రాల పట్ల సమాన దృష్టితో వ్యవహరించాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తన పర్యటన తిరస్కరణ వ్యక్తిగత అవమానం కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయమని వ్యాఖ్యానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి విదేశీ పర్యటనను అడ్డుకోవడం అంటే రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనని, కేంద్రం వైఖరిలో స్పష్టమైన వివక్ష కనిపిస్తోందని ఆరోపించారు. ఈ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా ఖండించాలని అన్ని వర్గాలకు పిలుపునిచ్చారు.

# పవర్ ఎగ్జిబిషన్-2026కు శ్రీకారం

హైదరాబాద్, ఆగస్టు 24: రాష్ట్రంలో ఒకప్పుడు 13 వేల మెగావాట్లుగా ఉన్న విద్యుత్ గరిష్ఠ డిమాండ్ ప్రస్తుతం 18 వేల మెగావాట్లకు చేరుకున్నప్పటికీ సమర్థవంతమైన ప్రణాళికలతో నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో థర్మల్, సోలార్, హైడల్, బ్యాటరీ స్టోరేజ్ వంటి పలు మార్గాల్లో సామర్థ్యాన్ని పెంచుతున్నామని ఆయన వివరించారు. ఆధునిక సాంకేతికత వినియోగంతో విద్యుత్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని చెప్పారు. 1912 టోల్‌ఫ్రీ సేవ, పవర్ అంబులెన్స్‌లు, అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ వంటి వినూత్న కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగులకు రూ.కోటి ప్రమాద బీమా కల్పించడంతో పాటు పెండింగ్ ప్రమోషన్లను కూడా మంజూరు చేసినట్లు చెప్పారు. ఉద్యోగుల సంక్షేమం, సేవల మెరుగుదల రెండింటినీ సమానంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

# క్రమశిక్షణకు అందరూ కట్టుబడాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై తాను బహిరంగంగా వ్యాఖ్యానించడం సరికాదని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ అంశాన్ని పార్టీ క్రమశిక్షణా సంఘం పరిశీలిస్తోందని, తగిన నిర్ణయం తీసుకునే బాధ్యత ఆ కమిటీదేనని స్పష్టం చేశారు. పార్టీ వ్యవహారాలు పార్టీ వేదికలపైనే చర్చించబడతాయని పేర్కొన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుగొండలో నిర్వహించిన మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారాన్ని పార్టీ నాయకత్వం సీరియస్‌గా పరిగణించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణా సంఘం మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది.

# విదేశీ పర్యటనపై సీఎంకు శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా తెలంగాణ అభివృద్ధికి ఉపయోగపడే అనేక అంశాలపై చర్చలు జరిగినట్లు పేర్కొంది. సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. విదేశీ పెట్టుబడుల సాధనతో పాటు తెలంగాణను దేశం లోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభు త్వం చేస్తున్న కృషిని అభినందించారు. ముఖ్య మంత్రి కూడా ప్రజాప్రతినిధులతో రాష్ట్రంలోని అభివృద్ధి కార్యక్రమాలు, నియోజకవర్గాల అవస రాలు, పెండింగ్ ప్రాజెక్టుల పురోగతిపై చర్చిం చారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిం చే దిశగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు మం త్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొ ని రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలపై తమ అభిప్రాయా లను వెల్లడించారు. పెట్టుబడుల ఆకర్షణ, మౌలి క వసతుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించినట్లు సమాచారం. విదేశీ పర్యటన అనంతరం ముఖ్యమంత్రి నిర్వహించిన ఈ సమావేశం రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపట్టనున్న తదుపరి కార్యాచరణపై స్పష్టత ఇచ్చిందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తెలంగాణకు మరిన్ని పెట్టుబడులు, అవకాశాలు తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సమావేశంలో పునరుద్ఘాటించినట్లు తెలిసింది.

# విజయగాథగా ముసునూరు

(మొదటి పేజీ తరువాయి)

తమిళ దినపత్రికలో పారిశ్రామికవేత్త ఎస్పీబీ పట్టాభి రామారావు మొక్కజొన్న పరిశ్రమలో సాధించిన విజయాల గురించి చదివినట్లు చెప్పారు. ఒకే వ్యవసాయ ఉత్పత్తిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఆయన ప్రయాణం తనను ఆకట్టుకుందని, వెంటనే అభినందనల లేఖ పంపినట్లు వివరించారు. అనంతరం పట్టాభి రామారావు తనను కలిసి పాప్‌కార్న్ బహుకరించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ తర్వాత ఉపరాష్ట్రపతి భవన్‌లో జరిగిన సమావేశంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో పాటు ఇతరులకు కూడా ఆ పాప్‌కార్న్ అందించినట్లు తెలిపారు. భారత రైతుల సామర్థ్యాన్ని, వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యతను ప్రపంచానికి చాటిచెప్పే ఉదాహరణగా ఈ సంఘటనను ప్రస్తావించినట్లు చెప్పారు. రైతు సంకల్పం, సాంకేతికత, పరిశ్రమ కలిస్తే ప్రపంచ మార్కెట్లను సైతం ఆకర్షించగలమని పేర్కొన్నారు. రైతులే దేశానికి వెన్నెముక అని ఉపరాష్ట్రపతి పునరుద్ఘాటించారు. దేశ ఆర్థికాభివృద్ధి, సంస్కృతి, సంప్రదాయాలు అన్నీ వ్యవసాయంతో ముడిపడి ఉన్నాయని వివరించారు. సంక్రాంతి, పొంగల్, లోహ్రీ, బిహు వంటి పంటల పండుగలు దేశ వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూనే వ్యవసాయం భారతదేశాన్ని ఏకం చేస్తోందని చెప్పారు. స్థూల విలువ జోడింపులో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా ఇప్పటికీ అత్యంత కీలకమని గుర్తుచేశారు. కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కోర్టెవా పాప్‌కార్న్‌కా సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి కలిసి కొత్త పాప్‌కార్న్ వంగడాన్ని ఆవిష్కరించి, వ్యవసాయ రంగంలో విశేష కృషి చేసిన పలువురు రైతులను సత్కరించారు.

# శ్వేత సంపాదకీయం

**మంగళవారం 25-8-2026**

## ధరాఘాతంపై సమీక్షించని పాలకులు

పాలక పార్టీలకు రాజకీయాలు తప్ప ప్రజల సమస్యలు పట్టడం లేదు. ఓట్లకోసం పథకాలను తీసుకుని వెళ్లడం, మధ్యతరగతి ప్రజలపై భారం మోపం తప్ప కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు మారడం లేదు. రాజకీయ పార్టీలు కూడా ఉచిత హామీలపై పాలక పార్టీలను నిలదీయడం తప్ప, ధరలఅపై ధర్నాలు చేసిన సందర్భాలు కనిపించడం లేదు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెవలడమెలా అన్న ప్రణాళికలు సిద్ధం చేసుకుంటు న్నారు. ఇందుకు అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కేంద్రంలోని బిజెపి నేతృత్వం లోని ఎన్‌డిఎ తీరు కూడా అదే విధంగా ఉంది. తాము చేసిందే పాలన అన్న విధంగా ప్రచారం చేసుకుంటు న్నాయి. నిత్యావసర ధరలు మొదలు, సిమెంట్, విమానయాన ధరుల అందనంత ఎత్తుకు పోతున్నాయి. దీంతో పేద మధ్యతరగతి ప్రజలు నకరయాతన పడుతున్నారు. ఒకటని లేకుండా క్రమంగా ధరలు పెంచే స్తున్నారు. చక్కెర, బెల్లం, పూలు, పండ్లు.. ఇలా ప్రతి వస్తువు ధర అమాంతం పెరిగిపోతోంది. ఎల్‌నినో బూచి చూపి ఫైన్ రైస్ రకం బియ్యం అమాంతంగా పెంచేశారు. కిలో 80 రూపాయాలకు బియ్యం ధరలు ఎగబాకాయి. బహిరంగ మార్కెట్లో సన్నరకాల ధాన్యం లభ్యత తగ్గడం..కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడం, సరఫరా వ్యవస్థలో ఒత్తిడి.. ధరల పెరుగుదలకు కారణాలని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మరోవైపు పౌరసరఫరాల సంస్థ అవసరాలకు మించి సేకరించిన ధాన్యం సుమారు 20 లక్షల టన్నుల వరకు ఉండగా..అందులో అధిక మొత్తంలో సన్నాలే ఉన్నాయి. ఈ వడ్లను వేలంలో అమ్మే పక్రియకు స్పందన రాకపోవడంతో సరకంతా మిల్లర్లు, గోదాముల దగ్గరే ఉండటం కూడా మరో కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. చింతపండు రెండువందలకు పైనే పెరిగింది, చక్కర ధరలు కూడా మెల్లగా పెంచుతూ.. అనూహ్యంగా పెరిగాయి. అందరూ ఫ్రీ దయాబిటిక్ కనుక వీటి ధరలు పెరిగినా ఫర్వాలేదని బీహార్‌కు చెందిన ఓ మంత్రి ఎకసక్కెంగా మాట్లాడారు. నిజానికి పాలకులు చేస్తున్న దుబారా ఖర్చులకు మాత్రం కళ్లెం పడడం లేదు.

ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కటేంటి వంటకు,పూజలకు ,పెళ్ళిళ్ళ వరకు అవసరమయ్యే అన్ని వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయి. ఉల్లిగడ్డ నెలరోజుల్లోనే దాదాపు రెట్టింపైంది. జులై నాలుగో వారంలో కిలో రూ.22-26 ఉంటే.. ఇప్పుడు రూ.45-52కి చేరింది. జూన్ మొదటి వారంతో పోలిస్తే వెల్లుల్లి కిలో ధర రూ.120-130 నుంచి రూ.250 అంటే దాదాపు వంద శాతం వరకు పెరిగింది. ఎండుమిర్చి రూ.240 నుంచి రూ.300కి చేరింది. వంటనూనెల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. లీటర్ నూనె ప్యాకెట్ 175కు చేరింది. బెల్లం కేజీకి రూ.55 నుంచి రూ.70-75కి పెరిగింది. పండగలు, శుభాకార్యాల్లో పిండివంటలు తప్పనిసరైన నేపథ్యంలో ఇది మరో భారమైంది. ఇక పెళ్లిళ్లు.. బోనాలు, శ్రావణమాస పూజల నేపథ్యంలో పూలకు గిరాకీ ఏర్పడగా..వ్యాపారులు దాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. బోనాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కోసారి జరుగుతుండటంతో ఆ సమయాల్లో ప్రాంతాల వారీగా పెంచేస్తు న్నారు. బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కనీసం పుస్తెలు చేయించే పరిస్తితి కూడా లేకుండా పోతోంది. బంగారనం ధరల మాఫియా ప్రపంచాన్ని శాసిస్తోంది.

బంగారం షాపుల వారు కల్తీల, తరుగు, జిఎస్టీ పేరుతో దోచేస్తున్నారు. పెళ్లి బడ్జెట్‌లో బంగారం పెద్ద భాగం. పెరిగిన ధరలతో మంగళసూత్రం సహా ఆభరణాల కొనుగోలు ఖర్చు తలచుకుంటేనే భయమేస్తోందని పెళ్లిళ్లు చేసే కుటుంబాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. ఇక నిత్యం వాడుకునే ఉల్లిగడ్డ ధరలు కూడా అనూహ్యంగా పెరిగాయి. కిలో 45కు తక్కువగా అమ్మడం లేదు. ఇదే కోవలో ఎండుమిర్చి, వెల్లుల్లి ధరలు కూడా భయపెడుతున్నాయి. ఇలా చెప్పకుంటూ పోతే ధరల జాబితా చాంతాండంత తయారవుతోంది. ఇక ఇల్లు కట్టుకునాలనుకునే వారికి సిమెంటు,స్టీలు, ఇటుక, ఇసుక ధరలు చిర్రెత్తిస్తున్నాయి. ఇకపోతే మందుల ధరలు, ఆస్పత్రుల ఖర్చులు చెప్పాల్సిన పనిలేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే నిత్యావసర ధరల పెరుగుదల కారణంగా సామాన్యుడి నెలవారీ ఇంటి ఖర్చు అమాంతంగా పెరగడంతో తలపట్టుకునే పరిస్థితి వచ్చింది. అయితే ఉత్పత్తి తగ్గడం, సరఫరా ప్రభావం వంటికారణాలతో వ్యాపారులు రోజుకో లెక్క చెబుతున్నారు. ఇలా ధరలు పెరుగుతున్నా కేంద్ర రాష్ట్రాలు సమీక్షించడం లేదు. ధరల అదుపునకు చర్యలు తీసుకోవడం లేదు. వ్యాపారులను నిలదీయడం లేదు. జనాభాకు తగ్గట్లుగా పంటులు పండుతున్నాయా లేదా అన్నది చూడడం లేదు. దేశంలో ఏయే పంటలు ఎంత పండుతున్నాయి..ఎంతెంత నిల్వలు ఉంటున్నాయో లెక్కలు వేయడం లేదు. ఏ సరుకు ఎక్కడి నుంచి ఎక్కడికి పోతేందో గమనించడం లేదు. బ్లాక్ మార్కెటీర్లను అదుపు చేయడం లేదు. ఇక విమాన ప్రయాణాన్ని సామాన్యులకు చేరువ చేస్తామిన గొప్పులు చెబుతున్న మోడీ సర్కార్ విమాన ధరలను గమనించడం లేదు. విమాన సంస్థలు మూతపడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇలాంటి వారంతా పాలకులుగా ప్రజలకు ఏం సందేశం ఇస్తారో చెప్పాలి. నిరసనలు చేసేవారు ధరల పెరుగుదలపై నిలదీయాలే తప్ప రాజకీయ ప్రయోజానాల కోసం కాదు. విపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తన బాధ్యతను పూర్తిగా విస్మరించింది. పార్లమెంట్ సమావేశాలను కేవలం ఆందోళనతో భ్రష్టు పట్టించింది. ఇది కూడా ప్రజలపై భారం మోపే చర్య తప్ప మరోటి కాదు. ఇవన్నీ కూడా ప్రజలు గమనించాలి. ప్రజాప్రతినిదులు వచ్చినప్పుడు ప్రలే నిలదీయాలి. అప్పుడైనా చలనం వస్తుందేమో చూడాలి.

## ఆయుధాలు సమకూర్చుకుంటున్న పాకిస్థాన్

**ఇస్లామిక్ కూటమితో బలోపేతం అయ్యేలా ప్రణాళికలు.. టర్కీ నుంచి ఆయుధాలు సేకరిస్తున్నట్లు అనుమానాలు**



న్యూఢిల్లీ,ఆగస్ట్24: ఆపరేషన్ సిందూర్ తరవాత పాకిస్తాన్ తీరు అనుమానాస్పదంగా ఉంది. అంతర్జాతీయంగా ఇస్లామిక్ కూటమితో బలోపేతం అయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు కూడా అనుమానాలు కలిగిస్తున్నాయి. మొత్తంగా పాకిస్తాన్ ఏదో భారీగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతర్గతంగా ఉన్న సమస్యల్ని పక్కదారి పట్టించేందుకు భారత్‌పై యుద్ధం చేయాలని భావిస్తుందా. ..అనే అనుమానాలు కలుగుతున్నాయి. పాకిస్తాన్ టర్కీ నుంచి భారీగా ఆయుధాలు దిగుమతి చేసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పాకిస్తాన్‌లో కీలక వైమానిక స్థావరమైన నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌కు టర్కీ సైనిక విమానాల రాకపోకలు పెరిగినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా సీ-130 హెర్క్యులెస్ విమానాలు రావల్పిండిలోని నూర్ ఖాన్, కరాచీలోని మసూర్ వైమానిక స్థావరాలకు వచ్చినట్లు తెలుస్తోంది.

ఆగస్టు 19 నుంచి 21 వరకు టర్కీకి చెందిన ఎ-130 విమానాలు పాకిస్తాన్‌కు వచ్చి వెళ్లాయి. దీనిని భారత నిఘా వర్గాలు అసాధారణ పరిణామంగా గుర్తించింది. ఈ విమానాల ద్వారా పాకిస్తాన్ డ్రోన్లు, డ్రోన్ సంబంధిత పరికరాలు, ఇతర సైనిక సామాగ్రి తరలించి ఉండొచ్చని నివేదికలు సూచిస్తున్నాయి. ఇదే కాకుండా చైనా నుంచి కూడా భారీగా ఆయుధాల దిగుమతి జరుగుతోందని తెలుస్తోంది. ముఖ్యంగా పాకిస్తాన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ పొందిందనే వాదన కూడా ఉంది. అయితే, ఈ ఆయుధాలు లేదా డ్రోన్ల సరఫరాపై పాకిస్తాన్ లేదా టర్కీ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ రాలేదు. అయితే, టర్కీ డ్రోన్లపై పాక్ ఎప్పటి నుంచో ఆసక్తి చూపిస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ టర్కీ డ్రోన్లను భారత్‌పై వాడింది. వీటన్నింటిని భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఇప్పటికే బైరక్టర్ టీబీ2 డ్రోన్లు పాక్ వద్ద ఉన్నాయి. గతంలో భారత్ తో సైనిక ఘర్షణ సమయంలో టర్కీ తన డ్రోన్ ఆపరేటర్లను కూడా పాకిస్తాన్‌లో మోహరించింది. ప్రస్తుతం పాక్ తన మానవరహిత వైమానిక సామర్థ్యాలను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా ఎక్కువసేపు గాల్లో ఉండగల డ్రోన్లు, లాయిటరింగ్ మ్యునిషన్ వంటి వ్యవస్థల్ని సమకూర్చుకుంటోంది.

మరోఇవైపు పశ్చిమాసియాలో ఘర్షణల వేళ పాకిస్థాన్, సౌదీ అరేబియా, తుర్కియే 'మక్కా సమష్టి రక్షణ ఒప్పందం' కుదుర్చుకున్నాయి. ఇంకా పలు దేశాలు ఈ మక్కా ఒప్పందం లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకున్నట్లు కనిపిస్తోంది. ఈ ఒప్పందంలో చేరాలని ఇరాన్‌కు ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. తమకు అందిన ఆహ్వానం పై సమీక్ష జరుపుతున్నామని, ఇది టెహ్రాన్‌కు దక్కిన విజయమని ఇరాన్ కీలకనేత మెహ్ది రహీమీ పేర్కొన్నట్లు పశ్చిమాసియాలోని మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఇరాన్ విదేశాంగశాఖ ఈ ఆహ్వానాన్ని ధ్రువీకరించాల్సి ఉంది. సౌదీ అరేబియాకు ఇరాన్ అనుబంధ గ్రూప్ హూతీలకు మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. అలాంటప్పుడు ఇరాన్‌కు ఈ ఆహ్వానం వెళ్లి ఉంటుందా..? అనే ప్రశ్నలు తలెత్తున్నాయి. అణ్వస్త్ర దేశమైన పాకిస్థాన్, నాటో సభ్య దేశమైన తుర్కియే, చమురు నిల్వలతో సుసంపన్నమైన సౌదీ అరేబియా మధ్య జరిగిన సంయుక్త రక్షణ ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా చర్చల్లో నిలిచింది. నాటో కూటమి మాదిరిగానే 'సభ్య దేశాల్లో ఏ ఒక్కదానిపై దాడి జరిగినా అది తమందరిపై జరిగిన దాడిగా మిగిలినవి భావిస్తాయి' అనే నిబంధనను ఈ ఒప్పందంలో చేర్చారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి మొత్తం పశ్చిమాసియాలో అనూహ్య మార్పులు వస్తున్నాయి. ఈ ప్రాంత దేశాలు అమెరికా రక్షణ ఛత్రం నుంచి క్రమంగా బయటకు రావాలని చూస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే ఇరాన్ ఈ ఒప్పందంలో చేరితే.. హూతీలపైనే దాడులు చేయాల్సి ఉంటుంది. అందుకే ఈ ఆహ్వానం ఏమేరకు ఫలిస్తుందో చూడాలి.





## పవిత్రోత్సవాలతో మరింత వైభవంగా తిరుమల

తిరుమల,ఆగస్ట్24: తిరుమలలో రద్దీ కొనసాగుతోంది. మరోవైపు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచసూక్తాలను పఠించారు. ఆ తర్వాత పవిత్ర ప్రతిష్ట జరిగింది. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ చేశారు. అనంతరం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మహారాష్ట్రలో మరో వైద్యుడిపై దాడి కలకలం

ముంబై,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో వైద్యుడిపై దాడి మరోసారి కలకలం రేపింది. థానేలోని కల్యాణ్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడిపై అతని కుమారుడు దాడికి పాల్పడ్డాడు. డాక్టర్‌ను దుర్భాషలాడుతూ కొట్టడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల ఓ మహిళా వైద్యురాలితో పాటు ఆస్పత్రి సిబ్బందిపై శివసేన కార్పొరేటర్ రమేశ్, అతని అనుచరులు దాడికి పాల్పడటం తెలిసిందే. ఆ దాడి సంచలనం సృష్టించిన కొన్ని రోజులకే తాజాగా మరో ఘటన జరగడంపై వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో దేశ్‌ముఖ్ అనే రోగిని ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ యోగేంద్ర జైస్వాల్ పరీక్షిస్తున్నారు. అతని పక్కటెముకకు గాయం కావడంతో చికిత్సా విధానం, బ్యాండేజ్ ఎలా వేయాలి, మందులు ఎలా వాడాలనే విషయాలను జైస్వాల్ వివరిస్తున్నారు. ఈ సమయంలో రోగి కుమారుడు ఒకే ప్రశ్నను పదేపదే అడుగుతూ అభ్యంతరకర భాషను ఉపయోగించాడు. దీనిపై డాక్టర్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో 'నువ్వేమైనా పెద్ద డాక్టరువా?' అంటూ రోగి కుమారుడు ప్రశ్నించినట్లు జైస్వాల్ వెల్లడించారు. అనంతరం బయటకు వెళ్లి తనను దూషించాడని, తాను అభ్యంతరం చెప్పడంతో తిరిగి వచ్చి దాడి చేశాడని ఆరోపించారు. తనపై దాడి చేసిన వ్యక్తిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడిని ఇంకా అరెస్టు చేయలేదు. ఇటీవలే డొంబివ్లిలోనూ ఓ వైద్యురాలిపై దాడి ఘటన కలకలం రేపింది. కల్యాణ్-డొంబివ్లి ప్రాంతానికి చెందిన శివసేన కార్పొరేటర్ రమేశ్.. ఓ మహిళా వైద్యురాలిపై దాడి చేయడం సంచలనమైంది. కార్పొరేటర్, ఆయన అనుచరులు ఆస్పత్రి సిబ్బందిపైనా దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, వరుస దాడులతో వైద్యుల్లో ఆందోళన నెలకొంది. తమకు భద్రత కల్పించాలని, దాడులకు పాల్పడే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని వైద్యులు, సిబ్బంది కోరుతున్నారు.




# 22ఏపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

రాష్ట్రంలో 22ఏ కింద లక్షల ఎకరాల భూములను కొత్తగా నిషేధిత జాబితాలో చేర్చారంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, 2023 డిసెంబర్ 7 నాటికి ఉన్న పరిస్థితి, ప్రస్తుతం నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రజల ముందుకు తీసుకువస్తోందన్నారు. 22ఏ పేరుతో ప్రతిపక్షాలు అనవసర ఆందోళనలు సృష్టిస్తూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని, ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. ప్రభుత్వ భూములు, అటవీ భూములు, వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్ భూములు, కోర్టు ఆదేశాల మేరకు నిషేధిత జాబితాలో ఉన్న భూములన్నింటి వివరాలను కేటగిరీల వారీగా వెల్లడిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ ప్రయోజనాల కోసం వినియోగించకుండా కాపాడటమే 22ఏ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఎంత భూమి నిషేధిత జాబితాలో ఉంది, ఎందుకు ఉంది, ఏ కారణాలతో చేర్చారనే ప్రతి అంశాన్ని రికార్డులతో ప్రజల ముందుకు తెస్తామని పేర్కొన్నారు. వాస్తవాలు బయటకు వచ్చిన తర్వాత నిజం ఎవరిదో ప్రజలే నిర్ణయిస్తారని వ్యాఖ్యానించారు. మెదక్, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ప్రభుత్వ భూములను ప్రైవేట్ భూములుగా చూపించే ప్రయత్నాలను గుర్తించినట్లు మంత్రి వివరించారు. నర్సాపూర్ ప్రాంతంలో వందల ఎకరాల ప్రభుత్వ భూముల వ్యవహారాలు, సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లిలో సరైన రికార్డులు లేకుండా భూ హక్కులు సృష్టించిన ఘటనలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. గుమ్మడిదల మండలంలో ప్రైవేట్ సర్వే నంబర్ పేరుతో అనుమతులు తీసుకుని ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టిన సందర్భాలను గుర్తించి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ భూములను రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ సర్వే నంబర్ 403 వ్యవహారంపై కూడా మంత్రి వివరణ ఇచ్చారు. మొత్తం సర్వే నంబర్ అప్‌లోడ్ కావడంతో ముఖ్యమంత్రి నివాసంతో పాటు ఇతర ఆస్తులు కూడా పీఓబీలో కనిపించాయని, దానిని వెంటనే సరిచేసినట్లు తెలిపారు. మహేశ్వరం, పర్వతాపూర్ ప్రాంతాల్లో భూదాన్, సర్వే నంబర్ల గందరగోళం వల్ల ఏర్పడిన సమస్యలను సమగ్ర సర్వేల ద్వారా పరిష్కరిస్తామని చెప్పారు. భూదాన్, అసైన్డ్, ప్రభుత్వ భూముల విషయంలో రికార్డులను కేసుల వారీగా పరిశీలించి వాస్తవ హక్కుదారులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. నకిలీ జీఓలు, బోగస్ మెమోలు, ఫేక్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న అక్రమాలను ప్రభుత్వం గుర్తించిందని మంత్రి తెలిపారు. మేడ్చల్ జిల్లాలో జిల్లా కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేసి నకిలీ మెమోలు సృష్టించిన ఘటనలు బయటపడ్డాయని, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ భూమిగా చూపించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.




# డీజీపీకి బహిరంగ లేఖ రాసిన ఎంపీ

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌కు బహిరంగ లేఖ రాశారు. ఇటీవల తన కదలికలను పర్య వేక్షించేందుకు తెలంగాణ పోలీసు శాఖలో ఏసీపీ స్థాయి అధికారిని నియమించినట్లు సమాచారం అందిందని ఆయన పేర్కొన్నారు. ఈ చర్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు జరుగుతున్నాయనే సమాచారం తనకు అందిందని లేఖలో ఆరోపించారు. దశాబ్దాలుగా సీవీ ఆనంద్‌ను సమర్థ అధికారిగా తెలుసునని ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు. అయితే తనపై నిఘా పెట్టేందుకు ఒక ఉన్నతాధికారిని నియమించారనే సమాచారం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ అంశంపై స్పష్టత అవసరమని డీజీపీని కోరారు. తెలంగాణ పోలీసు శాఖ రాజ్యాంగం, చట్టబద్ధ వ్యవస్థ ప్రకారమా లేక రాజకీయ కుటుంబాల ఆదేశాల మేరకా పనిచేస్తుందనే ప్రాథమిక ప్రశ్న తలెత్తుతోందని అరవింద్ వ్యాఖ్యానించారు. పోలీసు వ్యవస్థ ప్రజాస్వామ్య విలువలను కాపాడే సంస్థగా ఉండాలని, రాజకీయ ప్రభావాలకు అతీతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పోలీసు శాఖ చట్టానికి, రాజ్యాంగానికి మాత్రమే జవాబుదారీగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఏ రాజకీయ కుటుంబానికి లేదా వ్యక్తిగత ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయకూడదని అన్నారు. ఈ అంశంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తనపై నిఘా వ్యవహారానికి సంబంధించి వాస్తవాలు వెల్లడించాలని ధర్మపురి అరవింద్ డీజీపీని కోరారు. అధికారిక ఆదేశాల ప్రకారమే ఇలాంటి చర్యలు చేపట్టారా లేదా అనే విషయంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే ధర్మపురి అరవింద్ చేసిన ఈ ఆరోపణలపై తెలంగాణ పోలీసు శాఖ లేదా రాష్ట్ర ప్రభుత్వ వర్గాల నుంచి అధికారిక స్పందన వెలువడలేదు. ఈ వ్యవహారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.




# గిరిజన హక్కులు, అటవీ సంరక్షణకు ప్రాధాన్యం

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 24 :**

గిరిజనుల హక్కులను పరిరక్షిస్తూ అటవీ సంరక్షణకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ సూచించారు. కూనారం గ్రామంలో అటవీ, రెవెన్యూ భూములకు సంబంధించిన సమస్యలపై ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి గిరిజనులు, గ్రామస్థులు, రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల అధికారులతో ప్రజా వినతుల సమావేశం నిర్వహించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా సమగ్ర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పాత సర్వే రికార్డులు, జాయింట్ సర్వే నివేదికలు, రెవెన్యూ--అటవీ శాఖల పత్రాలను సమగ్రంగా పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని జాటోత్ హుస్సేన్ సూచించారు. గతంలో 250 ఎకరాలకు పైగా ఉన్నట్లు నమోదైన అంబాసత్రం భూమిని గుర్తించి, ఓవర్‌ల్యాప్ ప్రాంతాలను మరోసారి సర్వే చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ ప్రక్రియ ద్వారా 15 రోజుల్లో ప్రాథమిక స్పష్టత తీసుకు రావాలని పేర్కొన్నారు. జాయింట్ సర్వే ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సంబంధిత వ్యక్తుల సంతకాలు, వాంగ్మూలాలు, ఆధారాలను నమోదు చేసి భవిష్యత్ వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజనుల జీవనోపాధి, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూనే అటవీ సంపదను కాపాడే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ కూనారం సమస్యకు సంబంధించిన పాత, తాజా సర్వేలు, మ్యాపులు, రెవెన్యూ--అటవీ రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి తుది నివేదిక సిద్ధం చేస్తామని తెలిపారు. దమ్మపేట, కరకగూడెం,



అశ్వారావుపేట ప్రాంతాల్లో కూడా ఇలాంటి భూ సమస్యలపై జాయింట్ సర్వేలు కొనసాగుతున్నాయని, వచ్చే ఆరు నుంచి ఏడు నెలల్లో స్పష్టత వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 60 శాతం అటవీ ప్రాంతం ఉందన్నారు. 2.10 లక్షల ఎకరాలకు పైగా పోడు భూములకు హక్కులు కల్పించడంతో పాటు సుమారు 13 వేల మంది గిరిజనులకు బోర్‌వెల్ సౌకర్యం అందించినట్లు తెలిపారు. అటవీ హక్కుల చట్టం అమలులో భాగంగా అర్హులైన గిరిజనులకు న్యాయం జరిగేలా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ కూనారం భూ సమస్య ఐదు నుంచి ఆరు సంవత్సరాలుగా కొనసాగుతోందన్నారు. భూమి రెవెన్యూ లేదా అటవీ పరిధిలోకి వస్తుందో సమగ్రంగా నిర్ధారించి అర్హులైన గిరిజనులకు న్యాయం జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. ఈ ప్రజా వినతుల సమావేశంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, వివిధ శాఖల అధికారులు, సర్వేయర్లు, గిరిజనులు, గ్రామ స్థులు పాల్గొన్నారు.

# కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ నివేదిక కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల అంశం మరోసారి రాజకీయ వేడిని రాజేసింది. కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ సమర్పించిన నివేదిక నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ విమర్శల దాడిని ముమ్మరం చేసింది. ఈ నివేదికలో మూడు బ్యారేజీలను వినియోగించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారని బీఆర్ఎస్ నేతలు చెబుతుండగా, ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టీ. జీవన్ రెడ్డి స్పందిస్తూ, కేంద్ర సంస్థ నివేదిక కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులా మారిందని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అధికార పార్టీ ఇప్పటివరకు చేసిన ఆరోపణలు, విమర్శలు ఈ నివేదికతో బలహీనపడ్డాయని అన్నారు. ప్రాజెక్టుపై ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. టీ. జీవన్ రెడ్డి మాట్లాడుతూ, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను వాడుకోవచ్చని కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ స్పష్టంగా చెప్పిందన్నారు. అలాంటి పరిస్థితిలో ప్రాజెక్టుపై ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాజకీయాలు చేయకుండా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. నివేదిక వెలుగులోకి వచ్చిన తర్వాత నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించలేని పరిస్థితి ఏర్పడిందని జీవన్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, చేసిన ప్రకటనలపై ఇప్పుడు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉందన్నారు. కేంద్ర సంస్థ అభిప్రాయాలను ప్రభుత్వం గౌరవించి తదుపరి కార్యాచరణను ప్రకటించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రజా సమస్యలు అనేకం ఉన్న సమయంలో ఫుట్‌బాల్ కార్యక్రమం పేరుతో భారీగా ప్రజాధనం ఖర్చు చేశారని ఆరోపించారు. రూ.100 కోట్ల మేర నిధులను ఇతర అభివృద్ధి కార్యక్ర మాల కు వినియోగించి ఉంటే ప్రజ లకు మరింత ప్రయోజనం చేకూరేదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు.




కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వ్యవసాయ, సాగు నీటి రంగాలకు కీలకమని బీఆర్ఎస్ నేతలు పునరుద్ఘాటిస్తున్నారు. కేంద్ర సంస్థ నివేదికను పూర్తి స్థాయిలో ప్రజలకు వెల్లడించి, బ్యారేజీల వినియోగంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వ్యవహరించాలని, ప్రాజెక్టుకు సంబంధించిన అంశాల్లో పారదర్శకత పాటించాలని బీఆర్ఎస్ నాయకులు కోరుతున్నారు.

# కర్నేతండా ప్రాజెక్ట్‌కు శ్రీకారం

**వనపర్తి, ఆగస్టు 24 :**

వనపర్తి జిల్లాలో కర్నేతండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానిక రైతులకు సాగునీటి సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని వారు తెలిపారు. అనంతరం హెచ్‌ఏఎం ఫేజ్-1లో భాగంగా కొల్లాపూర్ నియోజకవర్గంలో రూ.41.75 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పాన్గల్ ఆర్అండ్‌బీ రహదారి నుంచి దావాజిపల్లి, ఖానాపూర్ మీదుగా పుల్గార్చెర్ల వరకు ఈ రహదారిని రెండు లేన్లుగా విస్తరించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పన అత్యంత కీలకమని అన్నారు. సాగునీరు, రహదారుల అభివృద్ధితో వ్యవసాయం, రవాణా రంగాలకు ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ కొల్లాపూర్ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేస్తున్నామని చెప్పారు. రహదారి విస్తరణ పనులు పూర్తయితే ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు గ్రామాల మధ్య అనుసంధానం బలపడుతుందని అధికారులు వివరించారు. ఈ పనులు ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడనున్నాయని పేర్కొన్నారు.



కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు మేఘా రెడ్డి, కూచుకుళ్ల రాజేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# వచ్చే ఎన్నికల్లో ఆలేరు బరిలో తీన్మార్ మల్లన్న

**మేడ్చల్ మల్కాజిగిరి, ఆగస్టు 24 :**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ మైదానంలో నిర్వహించిన “జెన్ జీ అడ్డా విత్ మల్లన్న” కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొని విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాది మంది విద్యార్థులు హాజరై విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, రాజకీయాలు, రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన ప్రశ్నలను సంధించగా, వాటికి మల్లన్న సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ నేటి రాజకీయ నాయకులు ప్రశ్నించే యువతను చూసి భయపడుతున్నారని అన్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావంతో నేటి యువత దేశ రాజకీయ దిశను మార్చగల శక్తిగా ఎదుగుతోందని పేర్కొన్నారు. యువత అన్యాయాలపై గళమెత్తాలని, ప్రజా సమస్యలపై చైతన్యవంతంగా ఉండాలని పిలుపునిచ్చారు.

విద్యా రంగంపై మాట్లాడిన తీన్మార్ మల్లన్న, విద్య మరియు వైద్య రంగాలకు కలిపి రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 40 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మొదటి తరగతి నుంచి ఉన్నత విద్య వరకు ప్రతి విద్యార్థికి పూర్తిగా ఉచిత విద్య అందించడమే తమ పార్టీ విధానమని ప్రకటించారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీపై పోరాటం కొనసాగిస్తామని, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రిజర్వేషన్ల అంశంపై స్పందిస్తూ సమాజంలో కుల వివక్ష కొనసాగుతున్నంతకాలం రిజర్వేషన్లు అవసరమేనని స్పష్టం చేశారు. రిజర్వేషన్లు తొలగించాలనే వారు ముందుగా కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడాలని సూచించారు. అలాగే విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు భారీగా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ అంశాన్ని అసెంబ్లీలో బలంగా ప్రస్తావిస్తానని తెలిపారు. విద్యార్థుల సమస్యలపై స్పందిస్తూ పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థుల ఉద్యమాలకు పూర్తి మద్దతు ప్రకటించారు. సరైన మౌలిక సదుపాయాలు లేకుండా విద్యాసంస్థలను విలీనం చేయడం సరైంది కాదని అన్నారు. ఆర్‌టీఈ చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు. రాజకీయంగా కీలక ప్రకటనలు చేసిన తీన్మార్ మల్లన్న, 2028 ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని వెల్లడించారు. అలాగే సెప్టెంబర్ 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 14 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపడతామని ప్రకటించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎన్నికల గుర్తు “కత్తెర” అని గుర్తు చేస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలను ఎదుర్కొనేందుకే ఆ గుర్తును ఎంచుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ అవార్డులు అందజేశారు.





# ఆర్థిక అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

**ఆర్థిక అక్షరాస్యతతోనే మెరుగైన ఆర్థిక నిర్ణయాలు**

**బ్యాంకింగ్, పొదుపు, బీమా, డిజిటల్ లావాదేవీలపై అవగాహన అవసరం**

**సూర్యాపేట, ఆగస్టు 24 :**

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో రూపొందించిన ఆర్థిక అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించడం ఎంతో అవసరమన్నారు. బ్యాంకింగ్ సేవలు, పొదుపు పథకాలు, రుణాలు, బీమా, పింఛన్ పథకాలు, డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు సరైన అవగాహన కల్పించడంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రజలు అందుబాటులో ఉన్న ఆర్థిక సేవలు, పథకాలపై అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హరిసింగ్, డీఆర్వో ప్రేమ్‌రాజ్, ఎల్‌డీఎం వెంకట నాగప్రసాద్, డీఆర్డీవో పీడీ సన్యాసయ్య, డీపీవో యాదగిరితో పాటు సూర్యాపేట జిల్లా కౌన్సిలర్లు శ్రవణ్‌కుమార్, రాంబాబు, అశోక్, రామకృష్ణ, నరేష్, లక్ష్మణ్, వెంకటేష్, మాధవి తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్‌లో కావేటి ఇంటర్నేషనల్ ఏఐ సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించిన ఉత్తమ్

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

అంతర్జాతీయ న్యాయ నైపుణ్యానికి కృత్రిమ మేధ (ఏఐ)ను జోడించి, అంతర్జాతీయ స్థాయి న్యాయ సేవలను సులభతరం చేసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'కావేటి ఇంటర్నేషనల్ ఏఐ' హైదరాబాద్ కార్యాలయాన్ని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వివిధ రంగాల్లో కృత్రిమ మేధ విస్తరిస్తూ నూతన అవకాశాలను సృష్టిస్తోందని, అదే సమయంలో సాంకేతికతను బాధ్యతాయుతంగా, పారదర్శకంగా వినియోగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బలమైన సాంకేతిక వ్యవస్థ, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉన్న హైదరాబాద్ నగరం ఏఐ ఆధారిత లీగల్ సర్వీసెస్‌కు కీలక కేంద్రంగా మారుతుందన్నారు. న్యూయార్క్‌కు చెందిన కావేటి లా సంస్థ వ్యవస్థాపకులు, 35 ఏళ్ల అనుభవం ఉన్న తెలంగాణ మూలాల న్యాయవాది డాక్టర్ శ్రీనివాసరావు కావేటిని మంత్రి అభినందించారు. ఈ కేంద్రం ద్వారా భారత్, అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, యూఏఈ వంటి దేశాలకు చెందిన న్యాయ నిపుణులతో ప్రవాస భారతీయులు, వ్యాపారవేత్తలు అనుసంధానమయ్యే అవకాశం లభిస్తుందని తెలిపారు.




# జీవో 97 రద్దు చేయాలి..

**పాలిటెక్నిక్ విద్యను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి**

**ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే విధానాలను విరమించుకోవాలి**

**పీడీఎస్‌యూ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి**

**సూర్యాపేట, ఆగస్టు 24 :**

ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని, ఇందుకు దారితీస్తున్న జీవో నెం.97ను రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ సూర్యాపేట జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో సోమవారం వందలాది మంది విద్యార్థులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

**పాలిటెక్నిక్‌ల విలీనంపై స్పష్టత ఇవ్వాలి**

ఈ సందర్భంగా పుల్లూరి సింహాద్రి మాట్లాడుతూ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకొని ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానాలను అనుసరిస్తే పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (×ూఖ) పరిధిలోకి తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆందోళన విద్యార్థుల్లో నెలకొందన్నారు. ప్రభుత్వ--ప్రైవేట్ భాగస్వామ్య (ౡౡ) విధానంలో నడిచే వ్యవస్థలో పాలిటెక్నిక్ విద్యను విలీనం చేస్తే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో విలీనం చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్‌బీటీఈటీని మరింత బలోపేతం చేయాలి

రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యకు సంబంధించి స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ూదీజు) స్వయం ప్రతిపత్తిని కొనసాగించడంతో పాటు దానిని మరింత బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను ప్రభుత్వ--ప్రైవేట్ భాగస్వామ్య విధానం ద్వారా ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్లే ఎలాంటి చర్యలనైనా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకొస్తున్న స్కిల్, హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇనిషియేటివ్స్ పాలసీ వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుపై అనేక సందేహాలు నెలకొన్నాయని పేర్కొన్నారు.

# ఎస్‌ఐఆర్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

**ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ, వార్డు సభలు**

**ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు ప్రత్యేక చర్యలు**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




**సూర్యాపేట, ఆగస్టు 24 :**

ఎస్‌ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి, ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్‌ఐఆర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు.

**మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు**

జిల్లాలో ఎస్‌ఐఆర్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్‌గా గుర్తించిన ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ఓటర్ల పేర్లు తప్పకుండా జాబితాలో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

**27న గ్రామ, వార్డు సభలు**

ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని గ్రామపంచాయతీల్లో గ్రామసభలు, పట్టణ ప్రాంతాల్లో వార్డు సభలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సభల్లో ఓటర్ల జాబితాలోని పేర్లను చదివి వినిపించాలని, ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే గుర్తించి సరిచేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ, వార్డు సభల నిర్వహణపై ప్రజలకు ముందుగానే విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు.

**బీఎల్‌వోలు తప్పనిసరిగా పాల్గొనాలి**

అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 27న నిర్వహించే గ్రామ, వార్డు సభల్లో బీఎల్‌వోలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. ప్రజలకు ఎస్‌ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు సభల వద్ద ఫారం-6, ఫారం-7, ఫారం-8 తదితర అవసరమైన దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలోని పేర్లను బీఎల్‌వోలు సభల్లో చదివి వినిపించాలని, జాబితాలో తప్పులు గుర్తిస్తే ప్రజల దృష్టికి తీసుకువచ్చి సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సభల నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలను డాక్యుమెంటేషన్ చేయడంతో పాటు ఫొటోలు, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

**అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు**

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. అనర్హులు లేదా తప్పుగా నమోదైన పేర్లను నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, సూర్యాపేట ఆర్డీవో వేణు మాధవ్, సి-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనూషతో పాటు ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# జంట హత్య బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

**మోతె, ఆగస్టు 24 :**



మోతె మండల కేంద్రంలో కొద్దిరోజుల క్రితం హత్యకు గురైన బిక్య తండాకు చెందిన హలోవత్ నాగు, భూభాల్ కుటుంబ సభ్యులను సోమవారం కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**బాధిత కుటుంబానికి అండగా ఉంటాం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జంట హత్య కేసులో నిందితులకు త్వరగా శిక్ష పడేలా సంబంధిత అధికారులతో మాట్లాడతానని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు.

**పలు కుటుంబాలకు పరామర్శ**

అనంతరం మండల పరిధిలోని హుస్సేనాబాద్ గ్రామంలో ఇటీవల మరణించిన గ్రామ ఉపసర్పంచ్ కొమ్ము ఎలమంచి అమ్మ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. సిరికొండ గ్రామంలో మరణించిన కాంగ్రెస్ నాయకుడు పొడిశెట్టి భిక్షం కుటుంబ సభ్యులను, ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు షేక్ సలీం కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి ఓదార్చారు.

**రిసెప్షన్ వేడుకకు హాజరు**

తదుపరి లాల్ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ధరావత్ రవీందర్ కుమార్తె రిసెప్షన్ వేడుకలో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, మోతె మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెలుగు వీరన్నతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాబార్డ్ సహకారంతో పాడి రైతుల ఎఫ్‌పీఓ ప్రారంభం

**రైతులు సభ్యులుగా చేరి రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే**

**ఉత్తమ్ పద్మావతి రెడ్డి**

**పాల ఉత్పత్తుల తయారీతో రైతులకు అదనపు ఆదాయం**

**చిలుకూరు, ఆగస్టు 24 :**



గ్రామీణ ప్రాంత పాడి రైతుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా నాబార్డ్ సహకారంతో చిలుకూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భానుపురి డైరీ రైతు ఉత్పత్తిదారుల మాక్స్ లిమిటెడ్ (ఎఫ్‌పీఓ) కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి సోమవారం ప్రారంభించారు. నాబార్డ్ డీడీఎం రవీందర్ నాయక్‌తో కలిసి ఆమె కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ పాడి రైతులందరూ ఈ సంస్థలో సభ్యులుగా చేరి, నాబార్డ్ ద్వారా అందే రాయితీలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు కేవలం పాలను విక్రయించడానికే పరిమితం కాకుండా, వాటిని వివిధ పాల ఉత్పత్తులుగా మార్చి మార్కెటింగ్ చేయడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఎఫ్‌పీఓ ద్వారా రైతులు సంఘటితమై ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. నాబార్డ్ డీడీఎం రవీందర్ నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా మండలంలో రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం (ఎఫ్‌పీఓ) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు సంఘటితంగా ముందుకు సాగితే ఉత్పత్తి, మార్కెటింగ్ రంగాల్లో మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ డాక్టర్ పి. పెంటయ్య, పశువైద్యాధికారి కె. వీరారెడ్డి, ఐఆర్డీఎన్ (ఎన్జీవో) వ్యవస్థాపకుడు వాడపల్లి రమేష్, సర్పంచ్ కొల్లు పులమ్మ నాగయ్య, తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు, సీఈవో అఖిల్ రెడ్డి, చైర్మన్ కొడారు రాము, డైరెక్టర్లు కందుకూరి కృష్ణమూర్తి, నెల్లూరి నాగేశ్వరరావు, మాతంగి వీరస్వామి, ఉబ్బపల్లి మంగమ్మ, పులగం ప్రభాకర్, శిరీష, స్వాతి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకన్న, ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, షేక్ సౌంద్ మియా, కొల్లు నాగయ్య, పొందు రమేష్, గంగిరెడ్డి నాగిరెడ్డి, ఎడవల్లి పుల్లారావు, కోల గురుస్వామి, అల్సకాని వెంకటయ్య, గుండు వెంకటేశ్వర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం బీజేపీ 48 గంటల నిరాహార దీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు సోమవారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో 48 గంటల నిరాహార దీక్షను ప్రారంభించారు. ధర్నా చౌక్ వద్ద దీక్షకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో పార్టీ కార్యాలయంలోనే 'ఫీజుల బకాయి--బీజేపీ లడాయి' పేరిట ఈ పోరాటానికి దిగారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మొండి వైఖరితో రూ.15,000 కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయకుండా దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని మండిపడ్డారు. విద్యాశాఖను తనవద్దే ఉంచుకున్న సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెట్టారని విమర్శించారు. ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందక ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి ధైర్యముంటే తెలంగాణకు వచ్చి విద్యార్థులకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఈ దీక్షా శిబిరంలో బీజేపీ ఎంపీ రేవతి శర్మ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసనమండలి పక్ష నేత ఏవీఎన్ రెడ్డి, ఎంపీలు రఘునందన్ రావు, డి.కె. అరుణ, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తదితర ముఖ్య నేతలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్

## పేటలో ఘనంగా తీజ్ వేడుకలు



**సూర్యాపేట, ఆగస్టు 24 :**

బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ వేడుకలను సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని 15వ వార్డు బాలాజీనగర్‌లో బంజారా తీజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**సంస్కృతిని కాపాడుకోవాలి**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది హాజరయ్యారు. సేవాలాల్ మహరాజ్, మేరమా యాడిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ పంటలు సమృద్ధిగా పండాలని, పశుసంపద వృద్ధి చెందాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ బంజారాలు తీజ్ పండుగను జరుపుకుంటారని తెలిపారు. గతంలో పల్లెలు, తండాలు, గూడాల్లో ప్రధానంగా నిర్వహించే ఈ పండుగను ప్రస్తుతం బంజారాలు నివసించే పట్టణ ప్రాంతాల్లోనూ ఘనంగా నిర్వహించడం సంతోషకరమన్నారు.

**తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో వేడుకలు**

కనుమరుగవుతున్న బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు జీవం పోసేలా యువతులు తొమ్మిది రోజుల పాటు ఎంతో పవిత్రంగా తీజ్ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

**ఆటపాటలతో గోధుమ బుట్టల ఊరేగింపు**

ఉత్సవాల తొమ్మిదో రోజు బంజారా యువతులు, మహిళలు పెద్ద సంఖ్యలో గోధుమ మొలకల బుట్టలను నెత్తిన పెట్టుకుని సంప్రదాయ వేషధారణలో ఆటపాటలతో ఊరేగింపుగా సద్దుల చెరువు మినీ ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నారు. అనంతరం సంప్రదాయ పద్ధతిలో తీజ్ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ పాండు నాయక్, చివ్వెంల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధారావత్ వీరన్న నాయక్, మాజీ జెడ్పీటీసీ జాటోత్ రాజేష్ నాయక్, మున్సిపల్ కౌన్సిలర్లు పిల్లల భవాని రమేష్ నాయుడు, కొండపల్లి దిలీప్‌రెడ్డి, నాగుల వాసు, చిలుముల సునీల్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ చింతమళ్ల రమేష్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఫారూఖ్, పంతంగి దశరథ, చిలుముల సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 75 ఏళ్ల వయసులోనూ సేవలో ముందంజ

## సమాజ సేవకుడు మహంకాళి సోమయ్య జన్మదిన వేడుకలు




**సూర్యాపేట, ఆగస్టు 24 :**

సమాజ సేవకుడు, శ్రీ వాసవి సేవా సమితి జిల్లా సభ్యుడు, సీనియర్ సిటిజన్ మహంకాళి సోమయ్య జన్మదిన వేడుకలను సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి సేవా సమితి కార్యాలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

**75 ఏళ్ల వయసులోనూ యువకుడిలా సేవా కార్యక్రమాలు**

ఈ సందర్భంగా శ్రీ వాసవి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చు పురుషోత్తం మాట్లాడుతూ, మహంకాళి సోమయ్య సీనియర్ సిటిజన్‌గా సమాజానికి విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. 75 సంవత్సరాల వయసులోనూ నవ యువకుడిలా ఉత్సాహంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు అండగా వాసవి సేవా సమితి శ్రీ వాసవి సేవా సమితి నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని బచ్చు పురుషోత్తం తెలిపారు. వారి సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ, సమితి ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి సేవా సమితి ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి నాగరాజు, కోశాధికారి సోమా ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు మిరియాల సుధాకర్, మహంకాళి ప్రణీత్, సభ్యులు శ్రీరంగం రాము, పోలా లక్ష్మీనారాయణ, తాటిశెట్టి హనుమంత్, చల్లా సత్యనారాయణ (కిరాణ) తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ రైతు నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి మృతికి సీపీఎం సంతాపం

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

ప్రముఖ కమ్యూనిస్టు నేత, అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు, సీపీఐ(ఎం) మాజీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సారంపల్లి మల్లారెడ్డి (90) మృతి పట్ల సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున 3 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం వామపక్ష, రైతు ఉద్యమాలకు తీరని లోటని పార్టీ పేర్కొంది. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో వరంగల్ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ పునర్నిర్మాణానికి, రైతు సంఘం విస్తరణకు మల్లారెడ్డి విశేష కృషి చేశారు. నర్సంపేట ప్రాంతంలో భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా, పేదలు, దళితుల భూముల పరిరక్షణ కోసం అనేక పోరాటాలు నడిపారు. ఆయన భౌతికకాయాన్ని మంగళవారం (ఆగస్టు 25) ఉదయం 8 గంటల నుంచి ఎంబీ భవన్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచి, అనంతరం సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీకి పరిశోధనల నిమిత్తం అప్పగించనున్నారు.



మల్లారెడ్డి మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితర రాజకీయ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సమస్యల సుడిగుండంలో సూర్యాపేట మున్సిపాలిటీ

## అభివృద్ధికి రూ.500 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

## కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ ధర్నా.. కలెక్టర్‌కు వినతిపత్రం

## సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



**సూర్యాపేట, ఆగస్టు 24 :**

సూర్యాపేట మున్సిపాలిటీ సమస్యల సుడిగుండంలో చిక్కుకుందని, పట్టణ సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్ల ప్రత్యేక బడ్జెట్‌ను వెంటనే కేటాయించాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో జూన్ 2 నుంచి ఆగస్టు 20 వరకు సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన పాదయాత్రలో గుర్తించిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

**డ్రైనేజీ అస్తవ్యస్తం.. ప్రజలకు ఇబ్బందులు**

ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. కాలువల్లో పూడికను సకాలంలో తొలగించకపోవడంతో అనేక వార్డుల్లో మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ సక్రమంగా చేపట్టకపోవడంతో ప్రజలు మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**చెరువులను పునరుద్ధరించి నీటి అవసరాలకు వినియోగించాలి**

అనేక వార్డుల్లో తాగునీరు, వాడుక నీరు సక్రమంగా అందడం లేదన్నారు. పట్టణ పరిసరాల్లో నీటి వనరులు ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పట్టణ పరిసరాల్లోని చెరువులను పునరుద్ధరించి తాగు, సాగునీటి అవసరాలకు ఉపయోగించాలని డిమాండ్ చేశారు. చిన్న వ్యాపారులకు సరైన స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి ప్రత్యేకంగా స్థలాలు కేటాయించాలని కోరారు.

**ప్రధాన రహదారులను నాలుగు లైన్లుగా విస్తరించాలి**

సూర్యాపేట మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.500 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. 60 ఫీట్ రోడ్డును కలెక్టరేట్ రోడ్డుతో అనుసంధానిస్తూ హైటెక్ బస్టాండ్ వద్ద అండర్‌పాస్ నిర్మించాలని కోరారు. కొత్త బస్టాండ్ నుంచి ఇమ్మాపురం ఫ్లైఓవర్ వరకు, గాంధీ బొమ్మ నుంచి కుసుమవారిగూడెం వరకు రహదారులను నాలుగు లైన్లుగా విస్తరించాలని డిమాండ్ చేశారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడంతో పాటు అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ప్రజాధనంతో నిర్మించి నిరుపయోగంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

**పరిష్కారం లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు**

మున్సిపల్ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపించడం వల్ల పట్టణ సమస్యలు మరింత పెరుగుతున్నాయని గుమ్మడి నర్సయ్య ఆరోపించారు. వీధి దీపాల ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించాలని కోరారు. పాదయాత్రలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం, అధికారులు వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ కుమార్, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు గొడ్డలి నరసయ్య, జిల్లా కార్యదర్శి సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్పీ అవతారమెత్తిన ఘరానా మోసగాడి అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

ఏపీకి చెందిన డీఎస్పీనని చెప్పుకుంటూ నకిలీ కంపెనీల్లో అధిక లాభాల ఆశచూపి కోట్ల రూపాయలు కొల్లగొట్టిన ఘరానా మోసగాడిని హైదరాబాద్ సీసీఎస్ ఆర్థిక నేరాల విభాగం (జూఔ) పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన కొండూరు రెడ్డి వెంకట్ రాజు అలియాస్ కేవీపీ రాజు (డీఎస్పీ రాజు--40)గా గుర్తించారు. నిందితుడు 2021 నుంచి పరారీలో ఉన్నాడు. పోలీసుల వివరాల ప్రకారం కేవీపీ రాజు తన ముఠాతో కలిసి రెండు తెలుగు రాష్ట్రాల్లోని అమాయకులను లక్ష్యంగా చేసుకునేవాడు. సీనియర్ పోలీస్ అధికారిగా నమ్మిస్తూ, బోగస్ కంపెనీల పేరిట నకిలీ డాక్యుమెంట్లు, పోస్ట్ డేటెడ్ చెక్కులు ఇచ్చి పెట్టుబడులు పెట్టించేవాడు. డబ్బులు తిరిగివ్వాలని అడిగితే తానో 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్'నంటూ బెదిరింపులకు దిగేవాడు. నగరానికి చెందిన ఓ బాధితుడి వద్ద రూ.1.20 కోట్లు వసూలు చేసి మోసం చేయడంతో నమోదైన కేసులో సీసీఎస్ బృందం ఇతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించింది.

# అమెరికా పర్యటన తిరస్కరణ వెనుక 'రాజకీయ కారణాలు' ప్రధాని మోదీ చెప్పాలి: రేవంత్

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

తన ప్రతిపాదిత అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యటనను అడ్డుకోవడం వెనుక ఉన్న 'రాజకీయ కారణాలను' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. 'తెలంగాణ రైజింగ్ 2047'లో భాగంగా పెట్టుబడుల ఆకర్షణ కోసం యూకే పర్యటనకు అనుమతించి, అమెరికా పర్యటనను నిరాకరించడం వివక్షాపూరితమని మండిపడ్డారు. ఆగస్టు 17 నుంచి 28 వరకు గుజరాత్ ముఖ్యమంత్రి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతి ఇచ్చిన కేంద్రం, తెలంగాణ పట్ల ఎందుకు పక్షపాతం చూపిస్తోందని ప్రశ్నించారు. పెట్టుబడుల ఆకర్షణలో గుజరాత్‌ను తెలంగాణ దాటిపోతుందనే భయంతోనే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. కేంద్రం ఎన్ని అడ్డంకులు సృష్టించినా డిసెంబర్ 8, 9 తేదీల్లో 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026'ను ఘనంగా నిర్వహిస్తామని, రాష్ట్ర ప్రగతిని ఎవరూ ఆపలేరని సీఎం స్పష్టం చేశారు.

# రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి మృతి పట్ల సీఎం రేవంత్ సంతాపం

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

రైతు సమస్యలపై జీవితాంతం రాజీలేని పోరాటం చేసిన సీనియర్ రైతు నేత, కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మల్లారెడ్డి సేవలను స్మరించుకున్నారు. రైతుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం మల్లారెడ్డి అనేక ప్రజా ఉద్యమాలను ముందుండి నడిపించారని కొనియాడారు. అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా, రైతు ఉద్యమ నిర్మాతగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. భూహక్కులు, సాగునీరు, విత్తనాలు, వ్యవసాయ రుణాల సాధన కోసం జీవితాన్ని అంకితం చేశారని శ్లాఘించారు. మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# మద్యం నోటిఫికేషన్లపై ఉన్న శ్రద్ధ.. ఉద్యోగాలపై ఏదీ?: హరీశ్‌రావు ధ్వజం

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తూ, 121 మద్యం బ్రాండ్లకు సంబంధించిన నోటిఫికేషన్‌ను మాత్రం అత్యంత వేగంగా విడుదల చేయడంపై మాజీ మంత్రి టి. హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తుంటే, ప్రభుత్వానికి మద్యం వ్యాపారంపై ఉన్న శ్రద్ధ నిరుద్యోగుల భవిష్యత్తుపై ఎందుకు లేదని నిలదీశారు. ఆదాయాన్ని పెంచుకోవడానికి మద్యం దుకాణాలు, బ్రాండ్లను పెంచడంపైనే ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఆరోపించారు. అధికారంలోకి రాగానే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామన్న హామీని గాలికొదిలేశారని, ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ యువ వికాసం పథకాలు పూర్తిగా నీరుగారిపోయాయని విమర్శించారు.



# మహానంది క్షేత్రంలో వైభవంగా పల్లకి సేవ

**మహానంది, ఆగస్టు 24, (మన దీపం)**

మహానంది క్షేత్రంలో శ్రావణ సోమవారం రాత్రి పల్లకీ సేవను ఆలయ వేదపండితులు,అర్చకులు వైభవంగా నిర్వహించారు.ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అలంకార మండపంలో శ్రీ కామేశ్వరీ సహిత మహానందీశ్వర స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఆశీనులు గావించి,విశేష పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# 22-ఎ ఆస్తులపై ఆందోళన వద్దు.. బాధితులకు న్యాయం చేస్తాం: పొంగులేటి

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

రిజిస్ట్రేషన్ల చట్టం సెక్షన్ 22-ఎ జాబితాలో చేరిన ఆస్తుల విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బాధితులందరికీ ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సోమవారం జిల్లాల అధికారులతో 22-ఎ సమస్యలపై సమీక్ష నిర్వహిస్తున్నామని, సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 22-ఎ జాబితా వివరాలు, సంబంధిత జీవోలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఆగస్టు 18 నుంచి ఇప్పటివరకు టోల్ ఫ్రీ నంబర్‌కు 1,162 కాల్స్ వచ్చాయని, వాటిలో అధికశాతం ప్రభుత్వ ఆస్తులకు సంబంధించినవేనని వివరించారు. రిజిస్ట్రేషన్ల నిలిపివేత సమస్యలను 24 గంటల్లోనే పరిష్కరిస్తున్నామని, ఒకటి రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నా వెంటనే పరిష్కరిస్తామని

# కేబీఆర్ పరిసరాల్లో ట్రాఫిక్ పరిస్థితుల పరిశీలన

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

కేబీఆర్ పార్కు పరిసర ప్రాంతాల్లో అమలు చేస్తున్న వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సమీక్షించారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 ప్రాంతంలో ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించేందుకు ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పర్యటించారు. వన్‌వే విధానం అమల్లోకి వచ్చిన తర్వాత వాహనాల రాకపోకలు ఎలా ఉన్నాయనే అంశంపై అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సంయుక్త పోలీసు కమిషనర్ (ట్రాఫిక్) డి. జోయెల్ డేవిస్, ట్రాఫిక్-2 డిప్యూటీ పోలీసు కమిషనర్ కాజల్ సింగ్ కేబీఆర్ పార్కు పరిసర ప్రాంతాలను సందర్శించారు. ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో వాహనాల కదలికలను పరిశీలిస్తూ ట్రాఫిక్ నిర్వహణపై అధికారులతో చర్చించారు. నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ట్రాఫిక్ పరిస్థితులు మరింత ప్రభావితమయ్యే అవకాశం ఉండటంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వర్షపు నీటి నిల్వలు, రద్దీ పెరిగే ప్రాంతాలు, ప్రత్యామ్నాయ మార్గాల వినియోగంపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఉన్నతాధికారులు సూచించారు. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో ట్రాఫిక్‌ను వేగంగా క్లియర్ చేయడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేబీఆర్ పార్కు పరిసర ప్రాంతాల్లో అమలు చేస్తున్న వన్‌వే విధానం వల్ల ట్రాఫిక్ రద్దీ తగ్గించడంతో పాటు ప్రయాణ సమయం తగ్గించడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ సూచనలను పాటిస్తూ నిర్ణయించిన మార్గాల్లోనే ప్రయాణించాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేసేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. వర్షాలు, రద్దీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చోట అదనపు సిబ్బందిని మోహరించి సాఫీగా



ట్రాఫిక్ సాగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.



# వైద్య కళాశాల పోస్టుల భర్తీ ప్రక్రియ

**జనగామ, ఆగస్టు 24 :**

జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా సోమవారం ఎంపిక పరీక్ష నిర్వహించారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జరిగిన ఈ పరీక్షకు అర్హులైన అభ్యర్థులు హాజరయ్యారు. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం ఈ ప్రక్రియ చేపట్టారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ 6, అసోసియేట్ ప్రొఫెసర్ 12, అసిస్టెంట్ ప్రొఫెసర్ 7 పోస్టులు కలిపి మొత్తం 25 ఒప్పంద ప్రాతిపదిక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ నియామకాల కోసం మొత్తం 13 దరఖాస్తులు అందగా, 10 మంది అభ్యర్థులు ఎంపిక పరీక్షకు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఎంపిక ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. నియామకాలు పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థుల అర్హతలు, ప్రతిభ ఆధారంగానే ఎంపికలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నాణ్యమైన వైద్య విద్య అందించాలంటే అధ్యాపకుల భర్తీ అత్యంత కీలకమని అధికారులు అభిప్రాయపడ్డారు. ఖాళీల భర్తీతో విద్యార్థులకు మెరుగైన బోధన అందడంతో పాటు వైద్య కళాశాల కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా కొనసాగనున్నాయని తెలిపారు. వైద్య విద్యా రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు అవసరమైన అధ్యాపక సిబ్బంది నియామకంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఖాళీల భర్తీ ద్వారా విద్యార్థులకు ప్రయోజనం చేకూరడంతో పాటు వైద్య సేవల నాణ్యత కూడా మెరుగుపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. నాగమణి, జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆర్. కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఎంపిక ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

# లే అవుట్ల అనుమతుల్లో నిబంధనలకే ప్రాధాన్యం



**నారాయణపేట, ఆగస్టు 24 :**

ప్రభుత్వ నిబంధనలను పూర్తిస్థాయిలో అనుసరించి మాత్రమే లే అవుట్లకు అనుమతులు మంజూరు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ప్రియాంక స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా లే అవుట్ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. లే అవుట్ల అనుమతుల జారీ ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన ఆరు లే అవుట్ దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా సంబంధిత శాఖల నుంచి వచ్చిన క్లియరెన్స్ వివరాలను కలెక్టర్ సమీక్షించారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మూడు లే అవుట్లకు అను మతులు మంజూరు చేయగా, నిబంధనలకు అనుగు ణంగా లేని మరో మూడు దరఖాస్తులను తిరస్కరిం చినట్లు వెల్లడిం చారు. లే అవుట్ అనుమతుల జారీ ప్రక్రియలో ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని కలెక్టర్ వివరించారు. దరఖాస్తుల పరిశీలనను సులభతరం చేయడం, సమయాన్ని ఆదా చేయడం, అనవస రమైన భౌతిక సమావే శాలను తగ్గించడం కోసం ఈ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు ఆన్‌లైన్‌లోనే తమ అభిప్రా యాలు, క్లియరెన్స్‌లు నమోదు చేయడం వల్ల ప్రక్రియ మరింత పారదర్శకంగా మారుతుందని చెప్పారు. ఆన్‌లైన్ పరిశీలన సమయంలో ఏదైనా అధికారి లేదా కమిటీ సభ్యుడు అభ్యంతరం వ్యక్తం చేస్తే, దానిని వ్యవస్థలోనే నమోదు చేసే విధానం ఉండాలని కలెక్టర్ సూచించారు. అభ్యంతరాలు లేని దరఖాస్తులను నేరుగా తదుపరి దశకు పంపించే విధానాన్ని అమలు చేస్తే సమయం, శ్రమ రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉన్న దరఖాస్తులను మాత్రమే భౌతిక సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవడం మరింత సమర్థ వంతమైన విధానమని అభిప్రాయ పడ్డారు. లే అవుట్ల అనుమ తుల విషయంలో అధికారులు అన్ని నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



# ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ప్రారంభం

**ఆదిలాబాద్, ఆగస్టు 24 :**

తాంసి మండలం కప్పర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమైన కలెక్టర్ విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులను కలెక్టర్ పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ గదిని కలెక్టర్ ప్రారంభించారు. డిజిటల్ విద్యకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంప్యూటర్ విద్య ద్వారా భవిష్యత్తు అవకాశాలను మరింత విస్తరించుకోవచ్చని పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను కూడా ప్రారంభించారు. విద్యార్థుల్లో ప్రకృతి పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు పౌష్టికాహార ప్రాధాన్యాన్ని తెలియజేయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో విద్యాభ్యాసం జరగాల్సిన అవసరాన్ని వివరించారు. అదే విధంగా పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండడం విద్యా ప్రమాణాల మెరుగుదలకు దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధిలో గ్రామస్థులు, ఉపాధ్యాయులు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, డీఆర్‌డీఓ రవీందర్, పంచాయతీరాజ్ ఈఈ శివరాం, తహసీల్దార్ గణేష్, ఎంపీడీఓ గడ్డం మోహన్ రెడ్డి, ఎంఈఓ శ్రీకాంత్, సర్పంచ్ గంద్రత్ అరుణ్, ఎంపీఓ అవినాష్, ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, ఆత్మ చైర్మన్ నారాయణ, ఏఏపీసీ చైర్మన్ ఇందిరా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




# గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ కేంద్రం పనుల పరిశీలన

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

మల్కాజిగిరి కమిషనరేట్ ట్రాఫిక్-1 డీసీపీ కే. రాహుల్ రెడ్డి గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ కొనసాగుతున్న పునరుద్ధరణ పనుల పురోగతిని పరిశీలించారు. కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలిస్తూ పనుల నాణ్యత, పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాణం, మరమ్మతులకు సంబంధించిన పెండింగ్ పనుల వివరాలను డీసీపీ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పూర్తైన పనులతో పాటు ఇంకా చేపట్టాల్సిన పనులపై అధికారుల నుంచి నివేదిక స్వీకరించారు. పోలీస్ సిబ్బందికి మెరుగైన వసతులు కల్పించే దిశగా చేపడుతున్న పునరుద్ధరణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. మిగిలిన పనులను మరింత వేగవంతం చేసి, ఎలాంటి జాప్యం లేకుండా ముందుకు తీసుకెళ్లాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల అమలులో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్మాణ కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని డీసీపీ కే. రాహుల్ రెడ్డి స్పష్టం చేశారు. సకాలంలో పనులు పూర్తి చేసి కేంద్రాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం



**ఆగస్టు 24 :**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశిం చారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 14 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారులు తమ వ్యక్తిగత, భూ, సంక్షేమ, పరిపాలనా సంబంధిత సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ప్రజల సమస్యలను ఓర్పుగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖల అధికా రులకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ప్రజావాణి ద్వారా అందుతున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దిష్ట గడువులో పరిష్కరిం చాలని కలెక్టర్ ప్రియాంక స్పష్టం చేశారు. ప్రతి శాఖ తమ పరిధిలోని ఫిర్యాదు లను క్రమం తప్పకుండా సమీక్షించి పురోగ తిని నమోదు చేయాలని ఆదేశిం చారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చు ట్టూ తిరగ కుండా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూప డం అధికారుల బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పారదర్శకంగా వ్యవహ రించాలని సూచించారు. శాఖల వారీగా అందిన అర్జీలను వెంటనే పరిశీలించి అవస రమైన నివేదిక లు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారా నికి సమర్థ వేదికగా నిలుస్తోందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీపై న్యాయమైన నిర్ణయం తీసుకునేలా జిల్లా యంత్రాం గం పనిచే స్తుందని స్పష్టం చేశారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై వేగంగా చర్యలు

**జగిత్యాల, ఆగస్టు 24 :**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం జగిత్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 53 ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుదారులు ఆశతో తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తున్నందున వాటి పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, అనవసర జాప్యాలకు తావివ్వకూడదని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచి ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకత పాటించాలని చెప్పారు. అర్జీలను ఎక్కువకాలం పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులో పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏవైనా కారణాల వల్ల ఆలస్యం జరిగితే దరఖాస్తుదారులకు పూర్తి సమాచారం అందించాలని సూచించారు. ప్రజలకు సరైన సమాచారం అందించడం కూడా అధికారుల బాధ్యతేనని పేర్కొన్నారు. ప్రజావాణి ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి అవకాశం కలుగుతోందని తెలిపారు. ఈ వేదికను సమర్థవంతంగా వినియోగించుకొని ప్రజా సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రతి ఫిర్యాదును సానుకూల దృక్పథంతో పరిశీలించాలని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే పరిపాలనలో ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన అర్జీలను శాఖల వారీగా పంపించి వాటి పరిష్కార పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



# నెక్స్ట్ మూవీ కోసమేనా?

హైదరాబాద్, ఆగస్టు 24:అక్కినేని యువ హీరో అఖిల్ అక్కినేని కెరీర్‌లో 'లెనిన్' కీలక విజయాన్ని అందించింది. చాలాకాలంగా ఎదురుచూస్తున్న కమర్షియల్ సక్సెస్‌ను అందుకున్న అఖిల్.. ఈ సినిమాతో రూ.100 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టారు. దీంతో అక్కినేని అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. 'లెనిన్'లో అఖిల్ తొలిసారి పూర్తిస్థాయి గ్రామీణ యువకుడి పాత్రలో కనిపించారు. అఖిల్ కొత్త లుక్.. నెక్స్ట్ మూవీ కోసమేనా? రూపాన్ని పూర్తిగా మార్చుకున్నారు. సతీమణి జైనబ్‌తో కలిసి విమానాశ్రయంలో కనిపించిన ఆయన.. హెయిర్ కట్, ట్రిమ్ చేసిన గడ్డంతో స్టైలిష్‌గా దర్శనమిచ్చారు. అఖిల్ కొత్త రూపానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజి క మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. తదుపరి సినిమా కోసమేనా? అఖిల్ కొత్త రూపం చూసిన అభిమానులు ఇది ఆయన తదుపరి సినిమా కోసమేనని అంచనా వేస్తు న్నారు. ప్రస్తుతం 'అఖిల్ 7'పై పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే తన తదుపరి ప్రాజెక్టుపై అఖిల్ ఇప్పటివరకు అధికారిక ప్రకటన చేయలేదు. పలువురు దర్శకుల పేర్లు దర్శకుడు బోయపాటి శ్రీను దర్శకత్వంలో అఖిల్ ఓ సినిమా చేయనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ పతా కంపై అల్లు అరవింద్ నిర్మించే అవకాశం ఉందని వార్తలు వస్తు న్నాయి. మరోవైపు దర్శకుడు పరశురామ్ పెట్లాతోనూ అఖిల్ ఓ ప్రాజెక్ట్ చేసే అవకా శముందని ప్రచారం సాగుతోంది. వీటిలో ఏ ప్రాజెక్ట్ ఖరారైందనే దానిపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.






## రిజెక్షన్‌తోనే 'కోయిలా'కు భారీ హిట్.. విజయ్ బుల్గానిన్ ఆసక్తికర వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

సినిమాల్లోకి రాకముందే తన సంగీతంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ సంగీత దర్శకుడు, గాయకుడు విజయ్ బుల్గానిన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. స్వతంత్రంగా రూపొందించిన పలు పాటలతో సంగీత ప్రియులకు దగ్గరైన ఆయన.. ఆ తర్వాత సినిమాల్లోకి అడుగుపెట్టి తన ప్రతిభను నిరూపించుకున్నారు. 'బేబీ' సినిమాతో సంగీత దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకోవడంతో పాటు ఫిల్మ్‌ఫేర్ అవార్డును కూడా అందుకున్నారు. విజయ్ బుల్గానిన్ కెరీర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన స్వతంత్ర పాటల్లో 'కోయిలా' ఒకటి. అలేఖ్య హారిక, వినయ్ షణ్ముఖ్ తదితరులతో కలిసి రూపొందించిన ఈ పాట అప్పట్లో యువతలో విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. తాజాగా ఈ పాట వెనుక ఉన్న ఆసక్తికరమైన విషయాన్ని విజయ్ బుల్గానిన్ వెల్లడించారు. 'కోయిలా' పాటను తొలుత స్వతంత్రంగా విడుదల చేయాలనే ఉద్దేశంతో రూపొందించలేదట. సినిమాల్లో ఉపయోగించాలనే ఆలోచనతో ముగ్గురు, నలుగురు దర్శకులకు ఈ పాటను వినిపించినట్లు విజయ్ బుల్గానిన్ తెలిపారు.

## సిరుత్తై చిన్నారి రక్షణ ఇప్పుడు ఎలా ఉందంటే?

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

సినిమాల్లో హీరోలు, హీరోయిన్లు, విలన్లతో పాటు కొందరు చైల్డ్ ఆర్టిస్టులు కూడా ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటారు. చిన్న వయసులోనే తమ నటన, క్యూట్‌నెస్‌తో మంచి క్రేజ్ తెచ్చుకున్న అలాంటి చైల్డ్ ఆర్టిస్టుల్లో బేబీ రక్షణ ఒకరు. తెలుగులో రక్షణ పేరు చాలామందికి తెలియకపోయినా.. తమిళ సినిమాలను, ముఖ్యంగా తమిళ డబ్బింగ్ చిత్రాలను చూసే ప్రేక్షకులకు ఆమె సుపరిచితమే. 2011లో కార్తీ హీరోగా నటించిన 'సిరుత్తై' సినిమాతో రక్షణ బాలనటిగా సినీరంగ ప్రవేశం చేసింది. ఈ చిత్రం రవితేజ నటించిన 'విక్రమార్కుడు'కు తమిళ రీమేక్‌గా తెరకెక్కింది. ఇందులో కార్తీ కూతురిగా నటించిన రక్షణ తన క్యూట్‌నెస్, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.





## రాఖీ యాడ్‌లో కృతి లుక్‌పై ట్రోలింగ్.. సపోర్ట్ కూడా!

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

బాలీవుడ్ నటి కృతి సనన్ నటించిన రక్షాబంధన్ యాడ్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ కోసం రూపొందించిన ఈ ప్రకటనలో కృతి ధరించిన ఇండో-వెస్ట్రన్ డ్రెస్‌పై కొందరు నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు. రక్షాబంధన్ వంటి సంప్రదాయ పండుగకు ఇలాంటి దుస్తులు ఎందుకంటూ ప్రశ్నిస్తున్నారు.

**రాఖీ యాడ్‌లో కృతి లుక్ ఇదే**

జ్యువెలరీ బ్రాండ్ రక్షాబంధన్ యాడ్‌లో కృతి సనన్ వైట్ కలర్ స్టైలిష్ బ్లౌజ్, స్కర్ట్‌లో కనిపించారు. యాడ్‌లో తన ఆన్‌స్క్రీన్ సోదరుడికి రాఖీ కట్టే సన్నివేశంలో ఆమె కనిపించారు. ప్రకటన విడుదలైన తర్వాత కృతి దుస్తులపైనే కొందరు నెటిజన్లు దృష్టి పెట్టారు. రక్షాబంధన్ వాతావరణానికి సంప్రదాయ దుస్తులు మరింత సరిపోయేవని కామెంట్లు చేశారు. 'పూజా తాలి ఎక్కడ?' అంటూ ప్రశ్నలు

కృతి లుక్‌తో పాటు యాడ్‌లో రక్షాబంధన్‌ను చూపించిన విధానంపైనా కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. పూజా తాలి ఎక్కడుందని, నుదుటన బొట్టు ఎందుకు లేదని ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. పండుగకు సంబంధించిన ప్రకటనలో సంప్రదాయ అంశాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిందని కొందరు అభిప్రాయ పడుతున్నారు. కృతికి మద్దతుగా మరో వర్గం మరోవైపు కృతిని విమర్శిస్తున్నవారికి కొందరు నెటి జన్లు గట్టిగా కౌంటర్ ఇస్తున్నారు. ఆమె ధరించింది బికినీ కాదని, ఇండో-వెస్ట్రన్ దుస్తులేనని చెబుతు న్నారు. పండుగ రోజున మహిళ ఎలాంటి దుస్తులు ధరించాలనే విషయంపై సోషల్ మీడియాలో నిబంధనలు విధించాల్సిన అవసరం లేదని కృతికి మద్దతు పలుకుతున్నారు. దీంతో యాడ్‌పై విమర్శలు, మద్దతు కామెంట్లు రెండూ వైరల్‌గా మారాయి.

## 'ఇరుముడి'లో ధనలక్ష్మి టీచర్.. ఈ నటి ఎవరో తెలుసా?

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి' ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. సినిమాతో పాటు ఇందులోని కొన్ని పాత్రలు కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా ధనలక్ష్మి టీచర్ పాత్ర సినిమా చూసిన తర్వాత కూడా ప్రేక్షకులను వెంటాడుతోంది. తెరపై తొలిసారి కనిపించినప్పుడే తన లుక్, చూపులు, నటనతో భయపెట్టిన ఈ పాత్రను చూసి చాలామంది ఆమె కొత్త నటి అనుకున్నారు. కానీ ధనలక్ష్మిగా కనిపించింది ఇప్పటికే దక్షిణాది చిత్ర పరిశ్రమలో గుర్తింపు తెచ్చుకున్న స్వాసిక విజయ్. స్వాసిక విజయ్ కెరీర్ ఇప్పుడే మొదలైంది కాదు. 2009లో తమిళ చిత్రం 'వైగై'తో హీరోయిన్‌గా సినీ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తమిళం, మలయాళ భాషల్లో వరుసగా సినిమాలు చేసింది. హీరోయిన్ పాత్రలకే పరిమితం కాకుండా.. కథలో ప్రాధాన్యం ఉన్న పాత్రలకు కూడా ఆమె ప్రాధాన్యం ఇచ్చింది. సినిమాలతో పాటు టెలివిజన్‌లోనూ పనిచేసిన స్వాసికకు కేరళలో మంచి గుర్తింపు ఉంది. 'వసంతి' చిత్రంలో ఆమె చేసిన పాత్రకు కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ క్యారెక్టర్ నటిగా పురస్కారం లభించింది. ఇటీవల తమిళ ప్రేక్షకుల్లో స్వాసిక పేరు మరింతగా వినిపించడానికి 'లబ్బర్ పందు' చిత్రం కూడా కారణమైంది.




## సూర్యకు మరో బ్లాక్‌బస్టర్.. రూ.200 కోట్ల క్లబ్‌లోకి!

**చెన్నై, ఆగస్టు 24 :**

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య వరుస విజయాలతో దూసుకెళ్తున్నారు. టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరితో కలిసి ఆయన నటించిన 'విశ్వనాథ్ ఆ సన్స్' చిత్రం బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. కుటుంబ కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రానికి తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతను కూడా ఆకట్టుకోవడంతో వసూళ్లు క్రమంగా పెరిగాయి. విడుదలైన రెండు రోజుల్లోనే రూ.100 కోట్ల గ్రాస్ సాధించిన సినిమా.. నాలుగు రోజుల్లో రూ.150 కోట్ల మార్కును దాటింది. రెండో వారంలోనూ థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.






## బాలయ్య 111వ సినిమాకు 'గాడ్' లేదా 'దాదా'?

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఎన్‌బీకే111'పై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వీరి కలయికలో వచ్చిన 'వీరసింహారెడ్డి' ఘన విజయం సాధించడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ హైప్ ఉంది. తాజాగా ఈ చిత్ర టైటిల్‌కు సంబంధించి ఫిలింనగర్ వర్గాల్లో ఓ ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం 'గాడ్' (+ూణ), 'దాదా' (ణూూణూ) అనే రెండు పవర్‌ఫుల్ టైటిల్స్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. బాలకృష్ణ ఇమేజ్‌కు, గోపీచంద్ మలినేని మాస్ మేకింగ్ స్టైల్‌కు ఈ రెండు పేర్లు సరిగ్గా సరిపోతాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. వీటిలో ఒక టైటిల్‌ను త్వరలోనే అధికారికంగా ఖరారు చేసి ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. హై-వోల్టేజ్ మాస్ యాక్షన్ అంశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467